
# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

సంపుటి : 48 సంచిక : 12 వెల : రూ. 18/- పుటలు : 36

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, మార్గశిర-పుష్య మాసములు డిసెంబర్ : 2025



150 వసంతాల వందేమాతరం



సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దేవులపల్లి గ్రామ వాస్తవ్యులు రఘువీరా రెడ్డి శ్రీ సరస్వతీ విద్యాపీఠానికి 2.7 ఎకరముల భూమిని దానంగా ఇచ్చారు. దీనికి సంబంధించిన పత్రాలను విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి శ్రీ పతకమూరి శ్రీనివాసరావు మరియు ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వెంకటలక్ష్మి గారికి అందజేశారు.



హైదరాబాద్ వాస్తవ్యులు తాండ్లెబాలాజీ గారు శ్రీ సరస్వతీ విద్యాపీఠానికి 0.20 ఎకరముల భూమిని దానముగా ఇచ్చారు. ఈ కార్యక్రమములో ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీ పతకమూరి శ్రీనివాసరావు, ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వెంకటలక్ష్మి, శ్రీ సరస్వతీ శిశుమందిర్ శంకరంపేట పాఠశాల సభ్యులు శ్రీ కుమ్మరి మల్లేశం మరియు ప్రధానాచార్యులు బంజే వీరప్ప, బిజెపి నాయకుడు శ్రీ కృష్ణ మరియు శ్రీ భగీరథ ఇతర ప్రముఖులు చిత్రంలో ఉన్నారు.



శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలమూరు విభాగ్ పాలమూరు పట్టణం లో ప్రముఖ సామాజికవేత్త విజయ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ విష్ణువర్ధన్ గారు శ్రీ సరస్వతీ శిశు మందిరము వీరన్నపేట ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు నిమిత్తము రూ. 2,79,000/-(అక్షరాల రెండు లక్షల డెబ్బది తొమ్మిది వేల రూపాయలు) చెక్ ద్వారా పాఠశాల అధ్యక్షులు శ్రీ శ్రీరామ్ రెడ్డి గారికి అందిస్తున్న చిత్రం. వీరితోపాటు ప్రబంధకారిణి ఉపాధ్యక్షులు శ్రీ వేణుగోపాల్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

కలియుగాబ్ది-5127, శాలివాహన శక సం. 1947, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం మార్గశిర-పుష్య మాసములు

సంపుటి : 50, సంచిక : 12, డిసెంబర్ 2025, పుటలు : 36, వెల : రూ.18/-



**సంపాదకులు**

**డా॥ అన్నదానం వేం. సుబ్రహ్మణ్యం**

**ప్రచురణ కర్త**

**పసర్తి మల్లయ్య**

**సంపాదకమండలి**

రావుల సూర్యనారాయణ

రమా విశ్వనాథన్

గోపగోని సప్తగిరి

అన్నావర్జుల శ్రీనాథ్

పతకమూరి శ్రీనివాసరావు

**ముద్రణ**

సాయి లిఖిత ప్రింటర్స్, ఖైరతాబాద్,

హైదరాబాద్-500004

**డి.టి.పి.**

**స్ఫూర్తి గ్రాఫిక్స్**

శ్రీ సరస్వతీ విద్యాపీఠము,

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004



**స్ఫూర్తి చందా వివరములు**

**స్ఫూర్తి వార్షిక చందా రూ॥ 220-00 లు**

యం.ఓ./ డి.డి. ద్వారా

శ్రీ సరస్వతీ విద్యాపీఠము పేరున

క్రింది చిరునామాకు పంపగలరు.



**శ్రీ సరస్వతీ విద్యాపీఠము**

ఇ.నెం. 6-3-597/ఎ/7,

వేంకటరమణ కాలనీ,

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.

**ఫోన్ : 040-23316160, 23316084**

**e - mail :sphoortissvp@gmail.com**


## అమృతవాణి

శ్లో॥ సూర్యాత్ భవంతి భూతాని సూర్యేణ పాలితా నితు ।

సూర్యే లయం ప్రాప్నువంతి య: సూర్య: సోహమేవచ ॥

**భావము :** సూర్యుని నుండే ప్రాణి కోట్లు కలుగుతున్నాయి. సూర్యుని చేతనే ప్రాణులు పోషింపబడుతున్నాయి. సూర్యుని వలననే స్థితి, లయలు సంభవిస్తున్నాయి. మనలోని నేను అనే చైతన్యానికి మూలమైన అంతర్యామి సూర్యుడే.

## ఈ సంచికలో . . .


| | |
|---|---|
| సంపాదకీయము | ... 04 |
| 150 వసంతాల వందేమాతరం | ... 05 |
| లైఫ్ సేవింగ్ అవార్డ్ | ... 07 |
| మాతృ సాహిత్యాన్ని సృష్టిద్దాం !! | ... 09 |
| ఈ యేడాది నోబెల్ బహుమతి గ్రహీతలు వీరే ! | ... 11 |
| భూమి - చలనాలు | ... 15 |
| చిత్రమాలిక | ... 17 |
| శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు | ... 21 |
| లోకజ్ఞానం - 205 | ... 22 |
| పిల్లలు నైపుణ్యాలకు ఎందుకు దూరమవుతున్నారు ? | ... 23 |
| చదవడం-ఒక మంచి అలవాటు | ... 25 |
| స్వదేశీ ఉద్యమ నాయకుడు బాబుగేను | ... 27 |
| విద్యార్థిలోకం ... వికసించే శ్లోకం | ... 29 |
| వార్తలు | ... 33 |



Printed & Published by **Pasarti Mallaiah** on behalf of Sri Saraswathi Vidya Peetham (Owner) and Printed at **Sai Likhita Printers**, # 6-2-959, D.B.Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd - 500004 and Published at Sri Saraswathi VidhyaPeetham, # 6-3-597/A/7, Venkataramana Colony, Khairatabad, Hyd - 500004 (Publication Place) Editor : **Dr. Annadanam Venkata Subrahmanyam.**

## జాతీయవాద సంస్థలను కించపరచడమా!

**రా**ష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభించి 100 యేండ్లు పూర్తయిన శుభ సందర్భంలో సంఘం శత జయంతి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించుకుంటోంది. ఈ వంద సంవత్సరాల కాలఖండంలో ఇంతింతైవటుడింతయై అన్నట్లుగా సంఘం పెరిగింది. కోట్లాది హిందువుల ఆదరాభిమానాల్ని చూరగొంది. ఒక పెద్ద సేవా సంస్థగా కూడ గుర్తింపు పొందింది. సైద్ధాంతిక విరోధులు కూడ సంఘం క్రమశిక్షణాయుత సంస్థ అని ప్రశంసించారు. సమాజం సంఘాన్ని ఒక దేశభక్తి సంస్థగా ఆదరిస్తోంది. అలాంటి సంఘాన్ని స్వతంత్ర భారత దేశంలోని కొందరు నేతలు ఆంగ్లేయుల అడుగుజాడలలో నడుస్తూ సంఘాన్ని అణచివేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. అవాకులు, చవాకులు ప్రేలుతున్నారు. సంఘాన్ని నిషేధించాలని అథవా సంఘంపై ఆంక్షలైనా పెట్టి సంఘకార్యానికి హిందూ సంఘటనా కార్యానికి అవరోధాలు సృష్టించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఆ తానులో ముక్కే కర్నాటక కాంగ్రెస్‌లోని మంత్రి వర్యులు ప్రియాంక్ ఖర్గే గారు. సాక్షాత్తు అఖిల భారతీయ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారి పుత్ర రత్నం. పెరుగుతున్న సంఘ శక్తిని, ప్రజాదరణను చూసి సహించలేక స్వార్థ బుద్ధితో ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ ఉద్యానవనాలు, మరియు దేవాలయ ప్రాంగణాలలో ఆర్.ఎస్.ఎస్. కార్యకలాపాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య గారికి లేఖ రాశారు. తక్షణమే యీ విషయాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. గతంలో ఆయన యీ సారి కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా ఆర్.ఎస్.ఎస్.ను నిషేధిస్తామని కూడ ప్రకటించారు. పాపం గతంలో నెహ్రూగారు, ఇందిరాగాంధీలు అలా ప్రయత్నించి యెలా భంగపడిందీ యీ అమాయక జీవికి తెలియదు కాబోలు. ఇది ఆయన అపరిపక్వ జ్ఞానాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రియాంక్ ఖర్గే లేఖకు స్పందిస్తూ కర్నాటక అంతటా ఐ లవ్ ఆర్.ఎస్.ఎస్. అంటూ పోస్టర్లు వెలిశాయి.

కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం కె.పి.ప్రవీణ్ కుమార్ అనే పంచాయతి డెవలప్‌మెంట్ అధికారి సంఘ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొన్నాడని ఉద్యోగం నుండి సస్పెండ్ చేసి నీతిమాలిన పని చేసింది. చిత్తాపూర్‌లో ఆర్.ఎస్.ఎస్. పథ సంచలన్ దృష్ట్యా కట్టిన భగవాధ్వజాలను, బానర్లను, కటౌట్లను అధికారిక అనుమతి లేదంటూ తొలగించివేశారు. హిందూ సమాజమంతా నిరసనను వ్యక్తం చేసింది. చిత్తాపూర్‌లో పథసంచలన్‌కు ప్రభుత్వం అనుమతి నిరాకరణను కర్నాటక హైకోర్టు కొట్టివేసి సంఘానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. కర్నాటక ప్రభుత్వానికిది పెద్ద చెంపపెట్టయింది. ఆర్.ఎస్.ఎస్. సత్య స్వరూపం మరోసారి ఋజువయింది.

* * *

అయోధ్యాపురిలో రామమందిరం గర్భగుడి పైన ధ్వజారోహణ కార్యక్రమం జరగడం స్వతంత్ర భారతదేశ చరిత్రలో మరొక అద్భుత ఘట్టం. ఆగమ శాస్త్రోక్త విధానంగా అక్కడ ధర్మధ్వజారోహణ జరిగింది. ధ్వజం త్రికోణాకారంలో కాషాయవర్ణంలో ఉంది. కాషాయ వర్ణం త్యాగానికి ప్రతీక. హిందూ జీవన శైలి ప్రపంచానికి మరొక సారి ఆవిష్కృతమైంది. భగవా పతాకం మీద ఇక్ష్వాకు వంశస్థుల కులదైవమైన సూర్య భగవానుని చిత్రముంది. కిరణ ప్రసరణుడైన సూర్యుడు జన చైతన్యానికి, జాగరణకు సంకేతం. అమర తరులైన మందార పారిజాతముల కలయికతో కశ్యపముని దేవకాంచన వృక్షాన్ని అంకురింప జేశారు. ఆ వృక్ష చిత్రము కూడ దానిపై ఉంది. ఓం అనే బీజాక్షరాలు కూడ దానిపై లిఖించబడింది. అదొక శ్రద్ధాకేంద్రంగా పరిఢవిల్లడం జాతికి గర్వకారణం. ★


ముఖ చిత్రకథనం

### 150 వసంతాల

# వందేమాతరం



✍ - డా|| అన్నదానం వేం.సుబ్రహ్మణ్యం




**ఆ**త్మవిస్మృతి నుండి మేల్కొనడానికి భారతజాతి ఆత్మగా బంకించంద్ర గళం నుండి వెలువడిన పదబంధం వందేమాతరం. ఆ పద ఉచ్చారణతోనే నిజమైన భారతీయుని శరీరం పులకరిస్తుంది. గగుర్పాటు చెందుతుంది. రోమాలు నిక్కపొడుచుకుంటాయి. శరీరంలో విద్యుత్ తరంగాలు ప్రవహించిన అనుభూతి కలుగుతుంది. భారత జాతిలో జాతీయ భావావిష్కరణకు మంత్రంలా పని చేసింది. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిలించింది. సమరనినాదమైంది. దేశ ప్రజానీకానికూపిరయింది. ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా వందేమాతరంతో పలకరించుకునే వారు. నరనరాల్లో దేశభక్తి భావన, ఏక జాతి భావన ప్రవహించేది.

వందేమాతరం అంటే తల్లీ నీకు వందనం. వందేమాతర గీతంలో పదబంధమే మొట్టమొదటి పదం. ఆ గీతమంతా మాతృభూమి వర్ణన, స్తుతికి సంబంధించింది కావడంవల్ల ఓ మాతృభూమి వందనం! అనే భావస్ఫూర్తికి ప్రేరణాస్రోతస్సయింది. విదేశీయుల పాలన నుండి దేశాన్ని విముక్తం చేయడానికి, జాతిని సమైక్యపరచి ఒక మహోద్యమాన్ని నడపడానికి ఉత్తేజాన్ని కలిగించిన జాతీయ గీతామది. సరిగ్గా నేటికి 150 యేళ్ళ క్రితం 1875లో బంకించంద్రఛటర్జీ రాసిన ఆనందమఠం నవలలో ఈ గీతం స్థానాన్ని సంపాదించుకుంది. బంకించంద్రుడు రాసిన దేశభక్తి పూరితమైన యీ గీతం బహుళ ప్రాచుర్యం పొందింది. జాతికి ఒక ఊపునిచ్చింది. చైతన్యాన్ని కలిగించింది.

ఈ జాతిని చైతన్యపరచడంలో ఒక తాటిపై నడిపించడంలో కొన్ని నినాదాలు ప్రధాన పాత్రను పోషించాయి. అవి భాషకు, కులమతాలకు అతీతమైనవి. అవే. 1. వందేమాతరం 2. భారత మాతాకీ జై 3. జైహింద్ 4. జైశ్రీరాం. ఇవి జాతికి తారక మంత్రాలై జాతిని సంరక్షించాయి. ఈస్టిండియా కంపెనీ పరిపాలనలో బెంగాలు రాష్ట్రం దారుణ దుర్భిక్షాన్ని చవిచూసింది. ఆ సమయంలో ప్రజలు చేసిన పోరాటమే ఆనందమఠం నవల ఇతి వృత్తం. ఆ సమయంలో దశనామి నాగాలు అనే సన్యాసులు కీలక పాత్ర పోషించారు. ఆ నవలలోనే బంకించంద్రుడు రాసిన వందేమాతర గీతాన్ని ఉల్లేఖించాడు. ఈ గీతం మనిషికి–మనసుకి– ఈమట్టికి ఉన్న తాత్త్వికతను తెలియజెప్పింది. వారధిగా నిలిచింది. దేశ మాతను స్మృతికి తెచ్చింది. శక్తిని ఆవహింపజేసింది. భారతీయుల కళ్ళు తెరిపించింది. స్వాభిమానాన్ని తట్టిలేపింది. విదేశీయుల పరిపాలనలో మగ్గిపోవడానికి కారణం స్వయంకృత అపరాధమేనని అది అనైకమత్యమేనని జ్ఞానోదయంమైంది.

వందేమాతర గీతం బెంగాలీ మరియు సంస్కృత భాషల కలయికతో సంయుక్తంగా వ్రాయబడింది. బెంగాలీ సాహిత్యంలో చైతన్యాన్ని కలిగించడంలో బంకించంద్రుడే ఆద్యుడు అని అన్నారు రవీంద్రనాథ్ ఠాగూర్. 1896లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మొట్టమొదట సారిగా యీ వందేమాతర గీతాన్ని ఆలపించారు. 1905లో బ్రిటిష్ ప్రభుత్వం వంగవిభజనను తలపెట్టింది. బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమానికి వందేమాతర గీతమే మార్చింగ్ సాంగ్ అయింది. ఉద్యమం శక్తిని సముపార్జించుకుంటోంది. వందేమాతరగీతం చైతన్యగీతమై సమైక్యతా గీతంగా

పరణమిస్తున్న దృశ్యాన్ని గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం రంగపూర్‌లో వందేమాతర గీతాన్నాలపించిన 200 మంది విద్యార్థులపై ఒక్కొక్కరికి 5 రూపాయల చొప్పున జరిమాన విధించింది. తరువాత వందేమాతర గీతాన్ని నిషేధించింది. అయినా వందేమాతరం ప్రభంజనంలా పెను తుఫాను సృష్టించింది. బిపిన్‌చంద్రపాల్ 1906లో వందేమాతరం పేరుతో పత్రికను ప్రారంభించారు. 1907లో జర్మనీలో జరిగిన సమావేశంలో మేడం కామా భారత జాతీయ పతాకాన్ని రూపొందించి దానిపై దేవనాగర లిపిలో వందేమాతరం అని రాసి ఆ సమావేశంలో ప్రదర్శించింది.

1906 ఏప్రిల్ 14న బారిసాల్‌లో వంగ విభజనకు వ్యతిరేకంగా పోరాడుతామని బెంగాలు ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. విభజనకు విత్తనం వేసిన కర్జన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వందేమాతరం అంటూ నినదించారు. ఆరోజుల్లో జరిగే సభాకార్యక్రమాలన్నింటిలో వందేమాతరం ప్రార్థనా గీతంగా పాడేవారు. విభజన వ్యతిరేకోద్యమం దేశమంతటా వ్యాపించింది. వందేమాతరం భారత్‌లోని అణువణువునా ఊపిరులూదింది. ఆనాడు ఏ భారతీయుడు, ఏ మతస్థుడు, ఏ ప్రాంతీయుడు, ఏకులస్థుడు వందేమాతరాన్ని వ్యతిరేకించలేదు. అభ్యంతర పెట్టలేదు. సమస్త ప్రజానీకం వందేమాతర గీతంలో సాంస్కృతిక భారతదేశాన్ని, సాంస్కృతిక జాతీయ వాదాన్ని సాక్షాత్కరించుకున్నారే కాని మతపరమైన దృష్టికోణం యెవరికీ గోచరించలేదు. ఈ దేశ స్వాతంత్ర్యంకోసం, విదేశీ వస్తువులు, విదేశీ సేవలను వ్యతిరేకిస్తూ "స్వ"త్వాన్ని ప్రతిష్ఠాపించడం కోసమే రాసిన గీతంగా విహరించింది. స్వలో దేశీయ వనరులు, ఆలోచనలుంటాయి. విభేదాలను విస్మరించి జాతి పునరుజ్జీవనానికి, అభ్యుదయానికి, సమష్టి వికాసానికి స్వ త్వమే దోహదపడుతుంది. అందుకు ప్రేరణ వందేమాతరం. అయితే దురదృష్టవశాత్తు వందేమాతర గీతాన్ని మత పరమైన దృష్టితో చూడటం మొదలు పెట్టడం ప్రారంభమైంది. దీనిని వ్యతిరేకించే శక్తులు పెరిగాయి. ఫలితంగా వందేమాతర గీతాన్ని పూర్తిగా ఆలపించకుండా ఒక చరణం మాత్రమే పాడుతూ గీతాన్ని కుదించుకుంటూ పోయారు. జాతీయ కాంగ్రెస్ సభలలో వందేమాతర గీతాన్ని ప్రారంభగీతంగా పాడటం సాంప్రదాయంగా వస్తుంటే 1923లో కాకినాడలో జరిగిన సభకు అధ్యక్ష స్థానంలో ఉన్న మహమ్మదాలీ గీతాలాపనకు అభ్యంతరం చెప్పారు. పాడితే అధ్యక్ష స్థానం నుండి దిగిపోతానన్నారు. అయినా ప్రముఖ సంగీత విద్వాంసుడు విష్ణు దిగంబర పాలూస్కర్ ఆ గీతాన్నాలపించి దేశభక్తులను ఉర్రూతలూగించారు. ఆబాల గోపాలానికి పెదవుల మీద నడయాడుతున్న గీతం వందేమాతరమని సోదరి నివేదిత గేయ ప్రాశస్త్యాన్ని తెలియజెప్పారు.

వందేమాతర గీతానికి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా పూర్తి గీతాన్ని, భావాన్ని తెలుసుకుందాం.

**వందేమాతరం.. వందేమాతరం**
**సుజలాం సుఫలాం మలయజ శీతలామ్**
**సస్య శ్యామలాం మాతరం ॥ వందేమాతరం.......**
**శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీమ్**
**పుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్**
**సుహాసినీం సుమధుర భాషిణీమ్**
**సుఖదాం వరదాం మాతరం ॥వందేమాతరం.........॥2॥**
**కోటి కోటి కంఠ కలకల నినాద కరాలే**
**కోటి కోటి భుజైర్ధృత ఖర కరవాలే**
**అబలా కేనో మాం ఎతో బలే**
**బహుబల ధారిణీం నమామి తారిణీం**
**రిపుదల వారిణీం మాతరం ॥ వందే ॥3॥**
**తుమి విద్యా తుమి ధర్మ**
**తుమి హృది తుమి మర్మ**
**త్వంహి ప్రాణాః శరీరే**
**బాహుతే తుమి మాం శక్తి**
**హృదయే తుమి మాం భక్తి**
**తోమారయి ప్రతిమాగడి మందిరే మందిరే ॥ వందే ॥4॥**
**త్వం హి దుర్గా దశప్రహరణధారిణీ**
**కమలా కమలదళ విహారిణీ**
**వాణీ విద్యాదాయినీ, నమామిత్వాం, నమామి కమలాం**
**అమలాం, అతులాం, సుజలాం, సుఫలాం, మాతరం**

(తరువాయి భాగం 8వ పుటలో...)

క్రీడా స్ఫూర్తి

# లైఫ్ సేవింగ్ అవార్డ్

✍ - తేజస్విని

**అ**ది రాత్రి సమయం. చీకటిగానే ఉంది. చిన్న రైల్వేస్టేషను కావడం వల్ల అక్కడక్కడ విద్యుద్దీపాలు వెలుగుతూనే ఉన్నాయి.

అది పశ్చిమ బెంగాల్‌లోని మెచెదా రైల్వేస్టేషను. స్టేషను రక్షణ, ప్రజల భద్రత కోసం డ్యూటీలో పోలీసులిద్దరు గస్తీ తిరుగుతున్నారు. ఒక ప్రయాణీకుడు దిగాలుగానే రైల్వేస్టేషనులోకి వచ్చాడు. అన్యాపదేశంగానే కూర్చున్నాడు. డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ అతనిని గమనించింది దూరం నుండే. ఫ్లాట్ ఫాం మీదకు రైలు వస్తుండడం అల్లంత దూరంలో ఉండగానే గమనించాడు దిగాలుగా ఉన్న ఆ వ్యక్తి. అంతే .... పట్టాల మీదకు వెళ్లి తల పెట్టేశాడు.

ఈ ఆకస్మిక సంఘటనను గమనించిన మహిళా కానిస్టేబుల్ వెంటనే స్పందించింది. ఎవరితోను సంప్రదించే సమయం లేదు. సిగ్నల్ ఆపమని చెప్పేటంత అవకాశం లేదు. ఒక్క ఉదుటున పట్టాల మీదకు దూకి విచార గ్రస్తుడై ఉన్న ఆ మధ్య వయస్కుడిని పట్టుకుని ఫ్లాట్ ఫాం మీద పడేసి తాను ఫ్లాట్ ఫాం మీదకు దూకింది వెంటనే. ఆ ప్రదేశాన్ని దాటి రైలు వెళ్ళిపోయింది. హమ్మయ్య... అంటూ హాయిగా ఊపిరి పీల్చుకొంది మహిళా కానిస్టేబుల్. ఒక నిండు ప్రాణం రక్షించబడింది. ఆ మహిళా కానిస్టేబుల్ యే మాత్రం సాహసించక పోయినా ఒక నిండు ప్రాణం ఆనాడు బలయ్యేది. అది తెలిస్తే ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతతో చేసేచూపులు, వాళ్ళు పడే సంతోషం మాటల ముందు తాను చేసిన పని చాలా చిన్న దే కదా! అన్నంత భావన కలిగిందామెకు.

ఆ మహిళా కానిస్టేబుల్‌కు అంతటి ధైర్యం అప్పటికప్పుడో లేదా ఒక్కరోజు లోనో వచ్చిందని భావించలేము. కొందరిలో పరిస్థితుల్ని బట్టి ఆ తెగువ వస్తుండవచ్చు కూడ. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ఆ దంపతులకు అయిదుగురాడపిల్లలు. ఒక మగ పిల్లవాడు. వారిలో ఒక్కరైనా పోలీసు ఉద్యోగం చేయాలని ఆ తల్లి ఆకాంక్ష. అప్పటికే చుట్టు పక్కల వాళ్ళు అయిదుగురు అమ్మాయిలు కదా! నీకు, పెళ్ళిళ్లు చేసి పంపక ఇంకా ఇంట్లో పెట్టుకుని చదివిస్తున్నావెందుకు అనే సూటీపోటీ మాటలు విని భరించలేక ముగ్గురికి పెళ్ళిళ్లు చేసి పంపించింది. నాలుగో అమ్మాయే అమ్మ ఆకాంక్షకు అనుగుణంగా 2019లో వచ్చిన రైల్వేపోలీసు నోటిఫికేషన్ చూసి అప్లై చేసి ఎంపికయింది. అయితే శిక్షణకోసం వేరే రాష్ట్రం వెళ్ళవలసి వచ్చింది. భాషవేరు, ఆహారపుటలవాట్లు వేరు. పైగా తట్టుకోలేనంత శారీరక శ్రమ. రోజూ ఏడుపును దిగమింగుకుంటూనే అమ్మకోరికను గుర్తు చేసుకుంటూ శిక్షణ పూర్తి చేసి రైల్వే పోలీసయింది.

ఆ అమ్మాయే రమణమ్మ, త్రినాథరావు దంపతుల కుమార్తె. వారిది విజయనగరం జిల్లా వంగర మండలంలోని తలగాం గ్రామం. సుమతి యం.కాం., పూర్తి చేసి రైల్వే పోలీసు అయింది.

2022లో మైనర్లను కాపాడినందుకు ప్రభుత్వం రెస్క్యూ ఫర్ చైల్డ్ మిస్సింగ్ అవార్డునిచ్చారు. ఇటీవల ఆత్మ హత్యకు పాల్పడిన వ్యక్తిని కాపాడినందుకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ **"లైఫ్ సేవింగ్ అవార్డు"ను** ప్రదానం చేశారు. అలాగే మరోవ్యక్తిని ఆత్మ హత్య నుండి కాపాడినందుకు **"బ్రేవరీ అవార్డు"** ఇచ్చారు. ఇవన్నీ వృత్తిపట్ల ప్రేమను, బాధ్యతను పెంచుతున్నాయని భావిస్తోంది. ఇంకా యెన్నో మంచి మంచి పనులు చేయాలని ఆశిద్దాం!

సుమతి నేటి తరం యువతులకు ఒక రోల్ మోడల్! ★

**విజయం వరించిందని విర్ర వీగకు,**
**ఓటమి ఎదురైందని నిరాశచెందకు**
**విజయమే అంతం కాదు, ఓటమి తుది మెట్టు కాదు**
**- స్వామి వివేకానంద**

(6వ పుట తరువాయి భాగం ...)

**॥వందేమాతరం ॥5॥**

**శ్యామలాం, సరలాం, సుస్మితాం, భూషితాం ధరణీం, భరణీం, మాతరం ॥వందేమాతరం ॥6॥**

**భావం:-**

పుణ్య ప్రదములైన గంగ, యమునాది జీవనదులను కలిగిన దానవు, మధురఫల భరితవు, మలయ పర్వతముల నుండి వీచే గాలుల చేత చందనాన్ని పొంది మా సేదతీర్చే వాత్సల్యపూర్ణవు అయిన తల్లీ! నీకు నమస్కరిస్తున్నాను - 1

స్వచ్ఛమైన తెలివెన్నెల చేత పరవశించిన రాత్రులు కలిగినదానవు. వికసించిన పారిజాత సుమాలతో శోభించే నిత్యమంగళ రూపానివి, దరహాస చంద్రికలతో మాపై ప్రేమామృతాన్ని కురిపించే వాత్సల్యపూర్ణవు, లలితపదసంభరిత సంభాషణా చతురవు అయిన తల్లీ! నీకు ప్రణామములు - 2

విజయయాత్రా సంరంభోత్సవ సమయంలో అసంఖ్యాక ప్రజల గొంతుకలలో నినదించే జయ జయ ధ్వానానివి (శబ్దానివి) నీవు. కోట్లాది భుజాలపై ధరింపబడిన పదునైన ఖడ్గసముదాయం కల్గినదానవు. అధికాధిక బల సంపన్నురాలవైన, ప్రచండ శక్తి స్వరూపిణివి అయిన నిన్ను అబల అని పేర్కొనటంలో ఔచిత్యం లేదు తల్లీ! శత్రు మూకలను సంహరించగల బలోపేతవైన వీరమాతవు నీవు. ప్రాణికోటి సకల దుఃఖాలను పోగొట్టి తరింపజేయగల దానవు నీవే తల్లీ! - 3

నీవు సమస్త జ్ఞానానివి. ధర్మానివి, సకల జీవకోటిలో చేతనా కేంద్రమైన హృదయస్థానానివి. సకల జ్ఞాన సారానివి నీవు. సమస్త జీవుల ప్రాణానివి నీవు. మమ్ములను దివ్యబలసంపన్నులుగా పెంచి పోషించే వీరమాతవు నీవు. అరివీర భయంకరమైన మా భుజాంతర్నిహితమై వున్న శక్తివి నీవేతల్లీ! అమ్మా! మా అందరి హృదయాలలో జనించే భక్తి రూపానివి నీవే. ప్రతి మందిరంలోను నీ దివ్యమంగళ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొంటాము - 4

దశవిధ ఆయుధధారిణి అయిన దుర్గవు నీవు. సకల సంపత్ ప్రదాయిని అయిన లక్ష్మీదేవివి నీవు. పరాపర విద్యా ప్రదాయిని అయిన సరస్వతీ మూర్తివి నీవు. తల్లీ! నీకు అభివాదములు. అనంతైశ్వర్య ప్రదాతవు, అనన్య సామాన్యురాలివి, పుణ్యజలపూర్ణవు, అన్నపూర్ణవు అయిన మాతృమూర్తీ! నీకు వందనములు. - 5

సస్యశ్యామలవు, సరళవర్తనివి, మందస్మిత వదనారవిందవు, సకలాభరణ భూషితవు అయిన మాతృమూర్తీ! విశ్వజననీ! నీకు శతాధిక వందనాలు. శతసహస్ర ప్రణామములు - 6 అని గీతార్థం.

2003లో బిబిసి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 10 గీతాలనెంపిక చేయడం కోసం ఒక సర్వే నిర్వహించింది. 155 దేశాలు, ద్వీపాలకు చెందిన ప్రజలు ఈ సర్వేలో పాల్గొన్నారు. మొత్తం 7000 పాటలు వచ్చాయి. ఎంపిక చేసిన మొదటి 10 గీతాలలో వందేమాతరం గీతం రెండవ స్థానాన్ని సంపాదించుకుంది. భారత ప్రధాని శ్రీ నరేంద్రమోదీ దేశప్రజల హృదయాలలో మరోసారి వందేమాతర స్ఫూర్తిని రగిలించారు. ఇంత గొప్పగా హృదయాలను కదిలించిన గీతం కాబట్టే భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపింది. స్వతంత్ర భారతాన్ని నిలబెడుతోంది. ఇక ముందుకూడా దేశాన్ని నడిపిస్తుంది. ★



**నారాయణఖేడ్:-** శ్రీ సరస్వతీ శిశుమందిర్, నారాయణఖేడ్‌లోని శిశు స్కూల్ పూర్వ విద్యార్థి మరియు ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ అయిన శ్రీ గడిల రవి కుమార్ పాఠశాలకు 50 కుర్చీలను విరాళంగా అందించారు. ★

**జీవితం అనేది గమ్యం కాదు... గమనం మాత్రమే...**
**ఎన్నిసార్లు ఓడినా గెలవడానికి అవకాశముంటుంది.**
**గమ్యం అనంతం... గమనం అనేకం ...**

పద్యం-పరమార్థం

# మాతృ సాహిత్యాన్ని సృష్టిద్దాం !!



ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి

**ఒ**కరు ఆజ్ఞ ఇస్తారు; పాటించాలి. ఒకరు మిత్రునిలా సలహా ఇస్తారు; ఇది మంచిదీ–ఇది చెడు సుమా అంటారు. దేనిని అనుసరించాలో తాను నిర్ణయించుకోవాలి. పక్కింటి వాళ్లు ఈ వస్తువు తెచ్చుకొన్నారు; బాగున్నది అంటుంది ఇల్లాలు. మన ఇంటికీ అదికావాలి; లేదా తనకూ అది కావాలి అని అర్థం చేసుకొని ఇంటాయన అది తెచ్చి పెట్టాలి.

దీనినే **ప్రభు (రాజు) సమ్మితం; మిత్ర సమ్మితం, కాంతా సమ్మితం** అంటారు సాహిత్యశాస్త్ర వేత్తలు. ఈ మూడింటి కన్నా గొప్పది మరొకటి ఉన్నది **అది మాతృసమ్మితం** అన్నారు సాహిత్యోపన్యాసం చేస్తూ ఒక సందర్భంలో శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యులు గారు.

ప్రాచీనాలంకారిక శాస్త్రవేత్తలు మాతృసమ్మితం ప్రస్తావించలేదు గాని మిగతా మూడింటిని గురించి చెప్పారు. సాహిత్యం మూడు విధాలుగా కనిపిస్తుంది; రాజులా శాసించే విధంగా ఉండేది; మిత్రునిలా సలహా ఇచ్చి మార్గాలను సూచించేది; కాంతలా దిశానిర్దేశం చేసేది. ఈ మూడింటికి సంబంధించి ప్రభు సమ్మితాలు వేదాలని, మిత్ర సమ్మితాలు పురాణాలని, కాంతాసమ్మితాలు కావ్యాలని సాహిత్య శాస్త్రవేత్తలు తమతమ అలంకార శాస్త్ర గ్రంథాలలో చెప్పారు.

అలా ఒక పద్యంలో ఈ మూడింటిని చెప్పిన కావ్యాలంకార సంగ్రహకర్త రామరాజ భూషణుని (భట్టు మూర్తి) పద్యం చూద్దాం. ఈ గ్రంథానికే నరస భూపాలీయం అని కూడా పేరుంది.

శా॥ **"వేదంబున నృపశాసనంబులు, సుహృ**
**ద్విజ్ఞాపనంబుల్ పురా**
**ణాది గ్రంథములు, అంగనాజన విలా**
**సా లాప లీలా సమ**
**ప్రాదుర్భావము లౌర కావ్యములు, క**
**ర్తవ్యోప దేశక్రియా**
**వాద ప్రక్రియ నెన్న కావ్యమహిమన్**
**వర్ణింపగా శక్యమే !"**

వేదాలు, రాజశాసనాలు, మంచి మిత్రుని సలహాల వంటివి. పురాణాలు, మహిళా మణుల విలాస వచనాలతో సమానమైనవి కావ్యాలు. ఈ పని చేయాలని ఉపదేశించి క్రియాశీలురను సంసిద్ధం చేయడంలో (పని మంతులను తయారుచేయడంలో) కావ్యాల కన్నా పురాణాల కన్నా, మనిషిని కర్తవ్యోన్ముఖుని చేయడంలో కావ్యాన్ని మించినది లేదని భావం.

**వేదాలు ప్రభు సమ్మితాలు :–** పరిపాలకులు ఈ పని చేయాలని శాసిస్తారు. మంత్రులు, సామంతులు, సేనాధి పతులు, భటులు, వ్యవసాయదారులు, వ్యాపారులు, వివిధ వృత్తుల వారు రాజుగారి ఆజ్ఞను పాటించాల్సిందే. ఇష్టపడితే మొక్కుకుంటా చేస్తారు. ఇష్టం లేకపోతే తిట్టుకుంటా చేస్తారు. ఎలాగైనా సరే చేయాల్సిందే. చేయకపోతే ఇక శిక్ష తప్పదు.

అంటే వేదం చెప్పింది సత్యం శాశ్వతం. సత్యంవద = సత్యం పలకాలి; ధర్మం చర = ధర్మం ఆచరించాలి ... ఇవి వేద (ఉపనిషత్) వాక్యాలు. పాటించాల్సిందే! ఎందుకు ! ఏమిటి ! ఏమవుతుంది అని అడగరాదు. వేద సాహిత్యం ఇలా రాజశాసనం లాంటిదన్నమాట. అందుకే ఈ సాహిత్యాన్ని ప్రభుత్వం అన్నారు.

**పురాణాలు మిత్ర సమ్మితాలు:–** అష్టాదశ పురాణాలు, 18 ఉప పురాణాలు, ఇంకా అటువంటివే అయిన భారతం, హరివంశం, బ్రహ్మ సూత్రాలు మొదలైనవన్నీ స్నేహితుల వంటివి. అందులోని కథల్లో వచ్చే పాత్రలను బట్టి, వారి గుణగణాలను బట్టి మనం నడచుకోవాలి. రామునిలాగా

నడచుకోవాలి; రావణుని లాగా వ్యవహరించకూడదు (రామాదివత్ చరితవ్యమ్-నరావణాదివత్) అని తెలుసుకోవాలి. స్నేహితులు ఏది మంచో-ఏది చెడో చెబుతారు. మనమే నిర్ణయించుకోవాలి. పురాణాలు మిత్రుల్లాగా ఇలా సలహాలిస్తాయన్నమాట.

**కావ్యాలు కాంతా సమ్మితాలు :-** ఇక కావ్యాల విషయం. కావ్యాలలో ఓ నాయకుడు, ప్రతి నాయకుడు, ఉండి కథ నడుస్తుంది. నాయికను నాయకుడు కాపాడతాడు. వారు దంపతులవుతారు. ఆమె వేదంలాగా (ప్రభువు వలె) ఆజ్ఞ ఇవ్వదు; మిత్రుని లాగా కథంతా చెప్పదు. తనకిది కావాలని సూటిగా అడగదు. తనకు కావాల్సిన దాని మీద మనసు పడి, అదెంత బావుంది అంటుంది. నాయకుడది గ్రహించి ఆమెకది సమకూరుస్తాడు. ఇలా చెప్పడాన్నే ధ్వని అనీ, వ్యంగ్యమనీ, కాంతా సమ్మితమనీ అంటారు.

ఈ మూడింటి కన్నా ప్రతి ఒక్కరినీ కదిలించే మాతృప్రేమ వంటి సాహిత్యం కావాలంటారు. సంప్రదాయాన్ని, భారత జాతీయ చైతన్యాన్ని కంఠదఘ్నంగా ఆకళింతకు తెచ్చు కొన్న విద్వాంసులు. అందుకే వారు అంతా మాతృ స్వరూపంగా చూస్తారు. విశ్వమాత, భారతమాత, గంగామాత, గీతామాత, గోమాత, వేదమాత, భూమాత అని సర్వే సర్వత్ర మాతృస్వరూపాన్నే దర్శిస్తారు.

**మాతా నిర్మాతా భవతి :-** అన్న ఆర్ష విజ్ఞానాన్ని ప్రచారం చేస్తారు. ఆ జ్ఞానమే ప్రపంచ శాంతికి మూలాధారంగా నిలుస్తుందని అంటారు. అందుకే మాతృ సమ్మిత సాహిత్యానికి ఆహ్వానం పలుకుతారు. జననీ జన్మభూమిశ్చ ....అన్న శ్లోకార్థాన్ని తెలుసుకోమంటారు. ★

---



## స్వయంగా బట్ట సంచీలు కుట్టి, ప్రజలకు పంపిణీ చేసిన పాల్వంచ శిశు మందిర్ విద్యార్థులు

**పాల్వంచ:-**ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, పర్యావరణాన్ని కాపాడటం, చెట్లను పెంచాలంటూ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాల్వంచ పాఠశాల చక్కటి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పర్యావరణాన్ని, భూమిని, పచ్చదనాన్ని కాపాడాలంటూ పాఠశాల విద్యార్థులతో "save earth"-"save water" అంటూ చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. దీంట్లో విద్యార్థులందరూ అద్భుతమైన ప్రదర్శన చూపించి, ఉత్సాహంగా పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకొని, భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతిని, పచ్చటి ప్రకృతిని అందించాలంటూ చక్కటి చిత్ర లేఖనంతో పిలుపునిచ్చారు. అలాగే ఇదే విషయంపై ముగ్గులు వేశారు. చెట్లను పెంచుతూ, పర్యావరణాన్ని కాపాడాలంటూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

మరో వైపు ప్లాస్టిక్ వాడకం ద్వారా ఎనలేని నష్టం వాటిల్లుతోందని, దీనిని పూర్తిగా నిషేధించాలని కూడా పాఠశాల విద్యార్థులు నినదించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, బట్ట సంచులను మాత్రమే వాడాలంటూ గొంతెత్తారు. ఇందులో భాగంగా పాఠశాల యాజమాన్యం మొదటగా బట్ట సంచులు కుట్టే ప్రక్రియను విద్యార్థులకు నేర్పించారు. బట్ట సంచులను కుట్టడం అనే ప్రక్రియను శ్రద్ధగా నేర్చుకున్న పాఠశాల విద్యార్థులు స్వయంగా తామే బట్ట సంచులు కుట్టారు. కుట్టిన ఆ బట్ట సంచులపై పాఠశాల పేరును కూడా రాసి, ప్రజలకు పంచి పెట్టారు. ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని, కేవలం బట్ట సంచులనే వాడి భూ మాతను కాపాడాలని విద్యార్థులు ఇల్లిల్లూ తిరిగి, ప్రచారం చేస్తుంటే బస్తీ వాసులు ఆనందభరితులైనారు.

(తరువాయి భాగం 14వ పుటలో...)

# ఈ యేడాది నోబెల్ బహుమతి గ్రహీతలు వీరే!

భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వైద్యం, సాహిత్యం, శాంతి, ఆర్థికశాస్త్రంలో ప్రముఖులకు ఏటా ప్రకటించిన విధంగానే నోబెల్ బహుమతులను 2025 సంవత్సరానికి కూడా నోబెల్ ఫౌండేషన్ ప్రకటించింది. 1895లో స్విడిష్ ఇంజనీర్, శాస్త్రవేత్త, ఇన్వెంటర్ ఆల్ఫ్రెడ్ నోబెల్ ఈ బహుమతులను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

భౌతిక శాస్త్రంలో జాన్ ఎం, మార్టిన్స్, మైఖేల్ హెచ్. డెవొరెట్, జాన్ క్లారేలు ఈ బహుమతిని అందుకోనున్నారు. వీరిలో క్లార్క్ (83) బర్కిలీలోని



యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియాలో, మార్టినిస్ శాంటా బార్బరాలో, డెవొరెట్ యేల్, క్యాలిఫోర్నియా యూనివర్సిటీల్లో పరిశోధనలు కొనసాగిస్తున్నారు. మాక్రోస్కోపిక్ క్వాంట్ మెకానికల్ టన్నెలింగ్, ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లో శక్తి క్వాంటీకరణంపై వేసిన పరిశోధనలకు వీరికి నోబెల్ బహుమతి లభించింది. ఈ పరిశోధనల ద్వారా క్వాంటమ్ ఫిజిక్స్ చేతిలో పట్టుకునే చిన్న చిప్ లో చూపించగలిగారు. ఇది క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ సెన్సార్లు, క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో కొత్త అవకాశాలకు తెరలేచింది. వీరిలో క్లార్క్, మార్టిన్లు అమెరికాకు చెందినవారు కాగా డెవొరెట్ ఫ్రాన్స్ దేశస్థుడు.

**రసాయనశాస్త్రం**

రసాయనశాస్త్రంలో లోహ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్ లను అభివృద్ధి చేసినందుకు ఒమర్ ఎం. యామి, మునుము కిటాగవ, రిచర్డ్ రాబ్సన్లు 2025 సంవత్సరం నోబెలుకు ఎంపికయ్యారు. కొత్త రూపంలో వీరు మాలిక్యులార్ ఆర్కిటెక్చర్ను రూపొందించారు. కిటాగవ (74) జపాన్లోని క్యోటో యూనివర్సిటీ, రాబ్సన్ (88) ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ మెల్ బోర్న్, యాఘీ (60) అమెరికాలోని యూనివర్సిటీ



ఆఫ్ క్యాలిఫోర్నియాలో పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు భారీ కుహరాలతో కూడిన మాలిక్యులర్ నిర్మాణాలను నిర్మించారని వీటి ద్వారా కార్బన్ డై యాక్సైడ్, మీథేన్ వంటి వాయువులు స్వేచ్ఛగా లోపలికి, బయటకు ప్రవహిస్తాయని నోబెల్ కమిటీ పేర్కొంది. ఈ మాలిక్యులర్ నిర్మాణాలు, మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ ఎడారిలో గాలినుంచి నీటిని సేకరించడానికి, కార్బన్ డైయాక్సైట్ను సంగ్రహించడానికి, విషపూరిత వాయువులు లేదా ఉత్ప్రేరక రసాయన ప్రతి చర్యలను నిల్వ చేయడానికి ఉపయోగ పడతాయని పేర్కొంది. 1989 నుంచి వీరి పరిశోధనలు కొనసాగుతున్నాయి. వీరు విడివిడిగానే తమ పరిశోధనలను కొనసాగించారు. 1901 నుంచి 2024 వరకు రసాయనశాస్త్రంలో 116 నోబెల్ బహుమతులు ప్రకటించగా 195 మంది శాస్త్రవేత్తలు వీటిని అందుకున్నారు.

**వైద్యశాస్త్రం**

పెరిఫెరల్ ఇమ్యూన్ టోలరెన్స్కు సంబంధించిన ఆవిష్కరణలు

చేసినందుకు మేరీ ఈ. ఇంకోవ్, ఫ్రెడ్ రామ్స్బ్రెల్, డాక్టర్ షికోమ్ షకాకుచిలను నోబెల్ వరించింది. వీరిలో బ్రంకోవ్, రామల్లు అమెరికాకు చెందినవారు కాగా వకాకుచి జపాన్ శాస్త్రవేత్త



ఇంకోవ్ (64) ప్రస్తుతం సియాటెల్ లోని ఇన్స్టిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయాలజీలో సీనియర్ ప్రోగ్రామ్ మేనేజరుగా పనిచేస్తున్నారు.. రామ్స్ డెట్ (64) శాన్ఫ్రాన్సిస్కోలో సోనోమా బయో థెరాపిటిక్స్కు శాస్త్రీయ సలహాదారు. సగాకునీ (74) జపాన్లోని ఒసాకా యూనివర్సిటీకి చెందిన ఇమ్యునాలజీ ఫ్రాంటియర్ రీసెర్చ్ సెంటర్లో ప్రొఫెసర్గా వ్యవహరిస్తున్నారు. మనుషుల ఆరోగ్యానికి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ అత్యవసరం. ప్రమాదకర బ్యాక్టీరియా, వైరస్లు దాడి చేసినప్పుడు వాటిని సమర్థ వంతంగా అడ్డుకొని శరీరాన్ని కాపాడుతుంటుంది. ఈ రోగ నిరోధక వ్యవస్థ సొంత కణాలపై దాడి చేయకుండా టీ-కణాలు ఏవిధంగా కాపాడుతాయో ఈ శాస్త్రవేత్తలు పరిశోధించి కనుగొన్నారు. అవి శరీరానికి రక్షకులుగా ఏవిధంగా పనిచేస్తున్నదీ విడమరచి చెప్పారు. రోగనిరోధక వ్యవస్థను సమతూకంగా ఉంచడంలో వీటి పాత్రను ప్రపంచానికి వెల్లడించారు. ఈ పరిశోధనలు కొత్త ఔషధాలు కొనుగొనేందుకు ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆటో ఇమ్యూన్, క్యాన్సర్ వంటి వ్యాధుల చికిత్సా విధానాలకు ఈ పరిశోధన ఒక మార్గం చూపింది. ఇమ్యూన్ టోలరెన్స్ను అర్థం చేసుకునే పద్ధతినే ఈ పరిశోధన మార్చివేసిందనే చెప్పాలి.

**సాహిత్యం**

హంగరీ రచయిత లాస్లో క్రాన్నహొర్కాయి

ఈసారి సాహిత్య విభాగంలో నోబెల్కు ఎంపికయ్యారు. రచనల్లో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని మేళవించి ప్రజల్లో చైతన్యం కలిగించడానికి కృషి చేసినందుకు ఆయనకు ఈ బహుమానం దక్కింది. ఒక పక్క నాగరికతలు విధ్వంసమవుతున్న తరుణంలోనూ కళలోని గొప్ప శక్తిని పునరుద్ఘాటిస్తూ దూరదృష్టితో ఆయన రచనలు చేశారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. అభౌతిక, లౌకికేతరంగా వుండే తన రచనల్లో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని మేళవించడం లాస్లో ప్రత్యేకత, సమాజం లోని అణచివేతలు, విధ్వంసాలపై తనదైన రచనా శైలితో విమర్శలు గుప్పించడం ఆయన ప్రత్యేకత. “కోప్కా బెర్న్ హార్డ్ వంటి ప్రముఖ రచయితలు అనుసరించిన మధ్య యూరప్ సంప్రదాయాన్ని కొనసాగించిన గొప్ప ఇతిహాస రచయిత. వింతైన ఊహలతో ఆయన రచనలు మూర్తీభవించాయి” అని నోబెల్ కమిటీ ప్రశంసించింది. లాస్లో 1954లో హంగరీలోని గ్యూలా ప్రాంతంలో హంగరీ విప్లవానికి సరిగ్గా రెండేళ్ల ముందు జన్మించారు. ఈ విప్లవాన్ని నాటి సోవియట్ యూనియన్ కఠినంగా అణచివేసింది. ఈ క్రమంలో చోటు చేసుకున్న నాగరికత విధ్వంసం చిన్న వయసులో లాస్లోపై గట్టి ప్రభావాన్ని చూపింది. అందుకనే ఆయన రచనల్లో ఒక నాగరికత అంతం కావడం, సరికొత్త ఊహా ప్రపంచాల ఆవిర్భావం వంటి అసంబద్ధతలు కనిపిస్తుంటాయి. యూరప్ అంతా తిరిగి తన



అనుభవాలతో ఈ నవలలను రచించాడు. 2008లో రచించిన వాక్ అండ్ వార్, సిలో జీర్ బిలోలు కూడా ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇప్పటి వరకు లాస్లో రచించిన ఐదు నవలలను యూరప్ సాహిత్యంలో ఆణిముత్యాలుగా పరిగణిస్తున్నారు. ఆయన ప్రతి రచనలో ఒక కల్పిత పట్టణమో గ్రామమో ఉంటాయి.

**శాంతి బహుమతి**

వెనిజులాకు చెందిన విపక్ష నాయకురాలు మారియా కోర్నియా మచాదో(57)ను శాంతి బహుమతి వరించింది. నిరంకుశ పాలన నుంచి, ప్రజాస్వామ్యం వైపునకు శాంతియుత మార్పుకోసం కృషి చేసినందుకు ఈమె నోబెల్‌కు ఎంపికయ్యారు. చుట్టూ చీకట్లు ముసురుకుంటున్నా ధైర్యంగా ప్రజాస్వామ్య అగ్నిజ్వాలను ఆరిపోకుండా రగిలించారు.



లక్షల మందికి ఆదర్శంగా నిలిచారని నోబెల్ శాంతి కమిటీ పేర్కొంది. వెనెజులా కమ్యూనిస్టుల పాలనలో ఉంది. ఇక్కడ ప్రజాస్వామ్యం కోసం ఆమె పోరాడుతున్నారు. దీంతో ఆమెపై మధురో ప్రభుత్వం తీవ్ర నిర్బంధం విధించింది. ప్రతిపక్ష నేతలంతా అరెస్టులకు భయపడి విదేశాలకు పారిపోయినా, ఈమె మాత్రం ఎంతమాత్రం చలించకుండా దేశంలోనే ఉంటూ తన పోరాటం కొనసాగిస్తున్నారు. గత ఏడాది వెనిజులాలో జరిగిన ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని మచాదో ప్రకటించారు. కానీ ఆ దేశ ఎన్నికల సంఘం ఆమె అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది. దీంతో ఆమె మరో ప్రతిపక్ష నేత ఎడ్ముందో గొ లెజ్‌కు మద్దతు పలికారు. కానీ ఎన్నికల్లో మదురో 51.95 శాతం ఓట్లతో గెలిచారని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆవిధంగా మూడోసారి దేశాధ్యక్షుడైన మధురో విపక్షాలపై ఉక్కుపాదం మోపడంతో అంతా విదేశాలకు వెళ్లిపోవడమో లేక అజ్ఞాతంలో కొనసాగడమో చేస్తున్నారు. ప్రస్తుతం మచాదో కూడా అజ్ఞాతంలోనే గడుపుతున్నారు. గొంజాలెజ్ స్పెయిన్లో ఆశ్రయం పొందారు. ఈ ఎన్నికల్లో గొంజాలెజ్ కు 67 శాతం ఓట్లు వచ్చినప్పటికీ, ఫలితాలను తారుమారు చేశారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అక్టోబర్ 7, 1967న మచాదో వెనిజులా రాజధాని కారకాస్లో జన్మించారు. ఇండస్ట్రియల్ ఇంజినీరుగా కెరీర్ ప్రారంభించిన ఆమె 2002లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తర్వాత "సుమటే' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. 2011 నుంచి 14 వరకు నేషనల్ అసెంబ్లీ సభ్యురాలు. ప్రస్తుతం వెనెజులా రాజకీయ పార్టీకి సమన్వయకర్తగా కొనసాగుతూ మదురోకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం కోసం పోరాటాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో లాటిన్ అమెరికాలో అసాధారణ సాహసిక పౌరుల్లో ఈమె ఒకరని నోబెల్ కమిటీ ప్రశంసించింది.

**ఆర్థికశాస్త్రం**

జోయిల్ మోకిర్, ఫిలిప్పి అఘియోన్, పీటర్ హోవిట్లు ఆర్థికశాస్త్రంలో బహుమతి అందు కున్నారు. సృజనాత్మక విధ్వంసంపై వీరి ప్రభావశీల వివరణకు ఈ బహుమతి లభించింది. ముఖ్యంగా కొత్త ఉత్పత్తులు, తయారీ విధానాలకు, కొత్త ఆవిష్కరణలు ఏవిధంగా దోహదపడతాయనే అంశాన్ని వీరు విశదీకరించారు. ఆర్థిక స్తబ్ధత ఎప్పుడైనా ఏర్పడే అవకాశముస్నందువల్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండటమే శ్రేయస్కరమని వివరించారు.



ఇందుకోసం వీరు కొన్ని ఉదాహరణలను కూడా పేర్కొన్నారు. నోబెల్ బహుమానంలో (రూ.10.63 కోట్లు) సగభాగం డచ్ ఆర్థికవేత్త మోకిర్ అందుకోనున్నారు. మిగిలిన సగ భాగాన్ని ఫిలిప్, పీటర్లు పంచు కుంటారు. వీరికి విడివిడి గా 18 క్యారెట్ల బంగారు పతకాన్ని కూడా మెడలో వేస్తారు. పాత ఆవిష్కరణల స్థానంలో కొత్తవి రావడం సహజమే

అయినప్పటికీ, ఇవి ఏవిధంగా విజయం సాధిస్తాయనేదాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి. దీన్ని ఈ ముగ్గురు ఆర్థిక వేత్తలు చక్కగా వివరించారని కమిటీ పేర్కొంది. ఇక్కడ కొత్త ఆవిష్కరణలు, పాత వాటిని నాశనం చేస్తాయన్న సత్యాన్ని గుర్తించాలి. దీన్నే సృజనాత్మక విధ్వంసం అంటారు. దీన్ని ఇజ్రాయిల్ మూలాలున్న నెదర్లాండ్స్ ఆర్థిక చరిత్రకారుడు జోయెల్ మోకిర్ చక్కగా వివరించారు. 79 ఏళ్ల ఈ ఆర్థికవేత్త ప్రస్తుతం అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలో తన పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఫ్రాన్స్‌లో జన్మించిన ఫిలిప్ అమియన్, కెనడాలో జన్మించిన పీటర్ హెూవిట్లు గణిత సిద్ధాంతాలతో వివరించారు. నిజానికి ఈ సృజనాత్మక విధ్వంసం సిద్ధాంతం ఇప్పటిది కాదు. 1942లో అప్పటి ప్రఖ్యాత ఆర్థికవేత్త జోసెఫ్ మమ్ పీటర్ ఈ భావనను తొలిసారి ప్రవేశపెట్టారు. అప్పట్లో తాను రచించిన "పెట్టుబడి దారీ విధానం సామ్యవాదం, ప్రజాస్వామ్యం" అనే పుస్తకంలో ఈ సిద్ధాంతాన్ని మొట్టమొదటిసారి వివరించారు.

(జాగృతి సౌజన్యంతో .... ) ★

(10వ పుట తరువాయి భాగం ...)

అలాగే విత్తన బంతులను తయారు చేసే విధానాన్ని కూడా విద్యార్థులకు ఆచార్యులు నేర్పించారు. దీనిని కూడా విద్యార్థులు అత్యంత శ్రద్ధగా నేర్చుకొన్నారు. తర్వాత విత్తన బంతులను (seed balls) అటవీ ప్రాంతంలోకి వెళ్లి, వందలాది విత్తన బంతులను అటవీ ప్రాంతంలో వేశారు. అమిత ఆనందాన్ని వ్యక్తం చేసిన తల్లిదండ్రులు, సమాజం.

శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో తమ పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు సమాజం గురించి, పర్యావరణ పరిరక్షణ లాంటి విషయాలు కూడా తమ పిల్లలకు నేర్పుతున్నారని తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకృతిపై, భూమిపై తమ పిల్లలకు ప్రేమ, భక్తి భావాలు స్థిరపడు తున్నాయని, పాఠశాల చేస్తున్న ప్రయత్నాలు అద్భుతంగా వున్నాయన్నారు. మరో వైపు పాల్వంచ స్థానిక ప్రజలు కూడా సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు చేస్తున్న సామాజిక సేవను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ★

## ఎన్‌సీసీ 78వ స్థాపన దినోత్సవ వేడుకలు



**NCC 78TH RAISING DAY CELEBRATED WITH GRANDEUR AT SVIS**



2025 నవంబర్ 23న SVIS లో NCC 78వ స్థాపనా దినోత్సవాన్ని దేశభక్తిలో ఉత్సాహంతో జరుపు కున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్మీకి చెందిన సబ్ మేజర్ సి. పి. ఎస్. ఆర్. సింగ్, సుబేదార్ సంజయ్ చెత్రీ, సుబేదార్ సత్యేంద్ర సింగ్ మరియు సుబేదార్ కృష్ణన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ప్రార్థనతో ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబించే సాంస్కృతిక నృత్యం ప్రదర్శించారు. అతిథులు క్యాడెట్లను క్రమశిక్షణ, నాయకత్వం మరియు జాతీయ సేవ పట్ల అంకితభావంతో ఉండాలని ప్రోత్సహించారు. సైనిక జీవితంపై ప్రేరణాత్మక ఆడియో–విజువల్ సెషన్ కూడా నిర్వహించారు.

కార్యక్రమం గ్రూప్ ఫోటో మరియు భోజనంతో ముగిసింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని ఈ దినోత్సవాన్ని అవిస్మరణీయంగా మార్చారు. ఈ వేడుక, యువతలో దేశభక్తి మరియు బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడంలో NCC ప్రాముఖ్యతను తెలియజేసింది. ★

**ఎవరికోసమో, దేనికోసమో ఎదురు చూడకండి.**
**మీరు చేయగలిగింది చేయండి, ఎవరి మీద ఆశ పెట్టుకోకండి**
**– స్వామి వివేకానంద**

విజ్ఞానం

# భూమి - చలనాలు



✍ ఉపద్రష్ట లక్ష్మణసూరి

## భూమి – చలనాలు

భూమికి రెండు రకాల చలనాలు ఉంటాయి.

1) భూభ్రమణం.

2) భూపరిభ్రమణం.

**1) భూభ్రమణం:–** భూమి తన అక్షాన్ని ఆధారంగా చేసుకుని పశ్చిమం నుంచి తూర్పునకు గంటకు సగటున 1610కి. మీ. వేగంతో తిరగడాన్ని 'భూభ్రమణం' అంటారు. భూమి ఒకసారి పూర్తి భ్రమణం చేసేందుకు పట్టే సమయం 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్లు. అంటే సరాసరిగా ఒక రోజు (24 గం.) సమయం పడుతుంది. భూమి భ్రమణ వేగం భూమధ్యరేఖ వద్ద గరిష్ఠంగా ఉంటుంది. భూభ్రమణ వేగం భూమధ్య రేఖ నుంచి ధ్రువాల వైపు వెళ్లేకొద్దీ శూన్యమవుతుంది. భూమి భ్రమణ సమయంలో స్థిరంగా ఉండే రెండు బిందువులను ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువంగా గుర్తించారు.

**అక్షం:–** భూమిపై ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువాలను కలుపుతూ భూనాభి లేదా భూమి కేంద్రం మీదుగా గీసిన ఊహారేఖను 'అక్షం' అంటారు. భూమి అక్షం దాదాపుగా 23 1/2 డిగ్రీలు తూర్పు వైపు వంగి ఉంటుంది.

**అక్ష ధ్రువత్వం:–** ఉత్తరాన స్థిరబిందువు అయిన ఉత్తర ధ్రువం పైభాగం ఎప్పుడూ ధ్రువనక్షత్రాన్ని సూచిస్తుంది. దాన్నే 'అక్ష ధ్రువత్వం' అంటారు.

**సౌరదినం:–** ఏదైనా ఒక రేఖాంశాన్ని సూర్యుడు దాటిన సమయం నుంచి తిరిగి అదే రేఖాంశాన్ని సూర్యుడు దాటిన సమయం వరకు పట్టిన కాలాన్ని 'సౌర దినం' అంటారు.

**ప్రకాశవృత్తం:–** భూమిలో సగభాగాన్ని సూర్యుడు ప్రకాశవంతంగా చేసే అంచును ప్రకాశ వృత్తం అంటారు. ఈ మహా వృత్తం భూమిపై సగభాగంలో వెలుతురు, సగ భాగంలో చీకటి ఉండేలా విభజిస్తుంది.

**2) భూపరిభ్రమణం:–** భూమి తన అక్షంపై తాను భ్రమిస్తూ నిర్దిష్ట కక్ష్యా మార్గంలో సూర్యుడి చుట్టూ తిరిగి రావడమే 'భూపరి భ్రమణం'. భూపరిభ్రమణానికి సరాసరిగా 365 రోజుల 6 గంటల 10 సెకన్లు పడుతుంది. దాన్ని సరాసరి 365 రోజులు లేదా ఒక ఏడాది గా లెక్కిస్తారు. దీన్నే 'సౌర సంవత్సరం' అంటారు. 365 రోజులు పోగా మిగిలిన 6 గంటలను నాలుగేళ్లకు ఒకసారి కలిపి 366 రోజులున్న లీపు సంవత్సరంగా పిలుస్తారు. లీపు సంవత్సరంలో వచ్చే అదనపు రోజును ఫిబ్రవరి నెలలో కలుపుతారు. భూమి సెకనుకు దాదాపుగా 30 కి.మీ. వేగంతో పరిభ్రమిస్తుంది. అంటే గంటకు 1,08,000 కి. మీ.

**భూకక్ష్య:–** భూమి సూర్యుడి చుట్టూ తిరిగే ఒక నిర్దిష్ట మార్గాన్ని భూకక్ష్య అంటారు. ఇది కొంచెం దీర్ఘవృత్తాకారంలో ఉంటుంది. భూకక్ష్యపొడవు 965 మిలియన్ కి.మీ.లు.

**పరిహేళి:–** భూమి, సూర్యుడికి మధ్య కనిష్ఠ దూరం ఏర్పడే సందర్భాన్ని 'పరిహేళి' అంటారు. ఆ సమయంలో భూమికి, సూర్యుడికి మధ్య కనిష్ఠ దూరం 147 మిలియన్ కి.మీ. ఉంటుంది. ఇది జనవరి 3న సంభవిస్తుంది. ఆ రోజు భూమి అత్యధిక సౌరపుటాన్ని గ్రహిస్తుంది. ఈ నెలలో భూగోళ సగటు ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువగా ఉంటాయి. Pere అంటే దగ్గర, Helios అంటే సూర్యుడు అని అర్థం.

**అపహేళి:–** భూమి, సూర్యుడికి మధ్య గరిష్ఠ దూరం ఏర్పడే సందర్భాన్ని 'అపహేళి' అంటారు. ఆ సమయంలో భూమి, సూర్యుడికి మధ్య గరిష్ఠ దూరం 152 మిలియన్ కి.మీ.లు. ఇది జులై 4న సంభవిస్తుంది. ఆరోజు భూమి అత్యల్ప సౌరపుటాన్ని గ్రహిస్తుంది. ఈ సందర్భంలో భూగోళ సగటు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. Ape అంటే దూరం, Helios అంటే సూర్యుడు అని అర్థం.

**విషవత్తులు:–** మార్చి 21, సెప్టెంబరు 23 తేదీల్లో

సూర్యకిరణాలు భూమధ్యరేఖ వద్ద నిటారుగా పడతాయి. ఆ రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా పగలు, రాత్రి సమానంగా ఉంటాయి. ఈ రెండు తేదీలను 'విషవత్తులు' అంటారు. మార్చి 21న సంభవించే విషవత్తును 'వసంతకాల విషవత్తు' సెప్టెంబరు 23న సంభవించే విషవత్తును 'శరత్కాల విషవత్తు' అని అంటారు.




**ఉత్తరాయణం:–** సూర్యుడు డిసెంబరు 22న, మకరరేఖ నుంచి జూన్ 21 నాటికి కర్కటరేఖకు ఉత్తరాభిముఖంగా ప్రయాణించి చేరతాడు. ఇలా సూర్యుడి ఉత్తరార్ధ గోళం ప్రయాణాన్ని 'ఉత్తరాయణం' అంటారు. ఇది 6 నెలలు ఉంటుంది.

**భూ పరిభ్రమణం, భూ భ్రమణం, భూమి అక్షం 23 $1/2^0$ వంగి ఉండటం. భూమి వంపు వల్ల రుతువులు ఏర్పడుతున్నాయి.**

**దక్షిణాయనం:–** సూర్యుడు జూన్ 21 నాటికి కర్కటరేఖ నుంచి దక్షిణాభిముఖంగా ప్రయాణిస్తూ డిసెంబరు 22 నాటికి మకరరేఖకు చేరడాన్ని దక్షిణాయనం అంటారు. ఇది 6 నెలలు ఉంటుంది.

**అయనాంతాలు:– జూన్ 21:–** ఈ తేదీ నాటికి ఉత్తర ధ్రువం సూర్యుడి వైపు వాలి ఉంటుంది. సూర్యకిరణాలు ఉత్తరార్ధ గోళంలోని కర్కటరేఖపై నిటారుగా పడతాయి. ఇదే సమయంలో సూర్యకిరణాలు ఏటవాలుగా ధ్రువప్రాంతాలపై ప్రసరిస్తాయి. ఈ కారణంతో ఆర్కిటిక్ వలయం నుంచి ఉత్తర ధ్రువం వరకు పగటి కాలం నిరంతరంగా ఆరు నెలలు ఉంటుంది. అందువల్ల ఉత్తరార్ధ గోళంలో వేసవికాలం ఏర్పడుతుంది. దీనికి భిన్నంగా దక్షిణార్ధ గోళంలో చలి అధికంగా ఉంటూ పగటి సమయంగా కంటే రాత్రి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దక్షిణార్ధ గోళంలో శీతాకాలం ఏర్పడుతుంది. భూమిపై ఉన్న ఈ స్థితినే 'వేసవి అయనాంతం' అంటారు.

**డిసెంబరు 22:–** ఈ తేదీ నాటికి దక్షిణ ధ్రువం భూమి వైపు వంగి ఉంటుంది. ఈ సమయంలో సూర్యకిరణాలు దక్షిణార్ధ గోళంలోని మకర రేఖపై నిటారుగా పడుతూ దక్షిణ ధ్రువం వైపు ఏటవాలుగా ప్రసరిస్తాయి. అందువల్ల దక్షిణార్ధ గోళం ఎక్కువ భాగం కాంతిని పొందుతుంది. కాబట్టి దక్షిణార్ధ గోళంలో వేసవి కాలం ఏర్పడుతుంది. దీనికి భిన్నంగా ఉత్తరార్ధ గోళంలో పగటి సమయం తక్కువగా, రాత్రి అధికంగా ఏర్పడుతూ శీతాకాలం ఏర్పడుతుంది. భూమిపై ఈ స్థితిని 'శీతాకాల అయనాంతం' అంటారు.

**భూభ్రమణ ఫలితాలు :–** పగలు, రాత్రి ఏర్పడతాయి. సముద్రంలో పోటు, పాటులకు కారణం అవుతుంది. దిక్కులు అనే భావనకు కూడా కారణమవుతుంది. కొరియాలిస్ ప్రభావం ఏర్పడుతుంది. అంటే పవనాలు, సముద్ర ప్రవాహాలు ఉత్తరార్ధ గోళంలో కుడివైపు, దక్షిణార్ధ గోళంలో ఎడమవైపు వంగి ప్రయాణించడం. కొరియాలిస్ ప్రభావాన్ని ఫెరల్స్ సూత్రం అంటారు. కొరియాలిస్ ప్రభావం భూమధ్య రేఖ నుంచి ధ్రువాల వైపు వెళ్లేకొద్దీ పెరుగుతుంది.. సమయం అనే భావనకు కూడా కారణమవుతుంది. సూర్యుడు తూర్పున ఉదయించి, పడమర అస్తమించే భావనకు కూడా భూభ్రమణమే కారణం. ★

---

**కెరటం నాకు ఆదర్శం ...**
**లేచిపడుతున్నందుకు కాదు, పడి లేస్తున్నందుకు ...**
**– స్వామి వివేకానంద**

# శిశుమందిరాల్లో కార్తీక పౌర్ణమి సంబరాలు



అశోక్‌నగర్



హుస్నాబాద్



కల్వకుర్తి



కరినగర్



కేశవనగర్



ముథోల్



మెదక్



సంగారెడ్డి - ప్రాథమిక

# శిశుమందిరాలలో సప్తశక్తి సంగం కార్యక్రమాల చిత్రమాలిక



బడంగ్‌పేట



బజార్‌హత్నూర్




జమ్మలమడుగు




కాచిగూడ




కళ్యాణదుర్గం



కందికల్‌గేట్



కార్వాన్




నాగర్‌కర్నూల్

# శిశుమందిరాలలో సప్తశక్తి సంగం కార్యక్రమాల చిత్రమాలిక




ఓబులాచారిరోడ్ - రాయదుర్గం




పామిడి




సదాశివపేట




శివరాంపల్లి




తాండూర్



తిరుపతి



శ్రీనివాసనగర్




వనపర్తి

# శిశుమందిరాల్లో వందేమాతరం గీతాలాపన



కోరుట్ల



కులబ్‌గూర్




పోసానిపేట



అచ్చంపేట



ఆర్మూర్



బేతంచర్ల



గుజరిగల్లి



హనుమకొండ

# శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు



యం.సంగీత –3వ తరగతి–గట్టుప్పల్



ధర్మతేజరెడ్డి–9వ తరగతి–కర్నూల్




తన్విక –4వ తరగతి–నాదర్‌గుల్



యన్.శ్రీరాఘవ –10వ తరగతి–కె.డి.ఆర్.నగర్



బి.అక్షర –7వ తరగతి – మాదన్నపేట



కె.ఆరాధ్య –8వ తరగతి–నారాయణఖేడ్

జి.కె.

# లోక జ్ఞానము - 205



## నవంబర్ 2025, "స్ఫూర్తి" ఆధారంగా

అయాచితుల లక్ష్మణరావు

1. 2036లో ఒలింపిక్స్ క్రీడలు ఏ దేశంలో జరుగనున్నాయి ?
2. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రార్థన ఏ సం॥ నుండి పఠిస్తున్నారు ?
3. శాంతినికేతన్ విశ్వవిద్యాలయము స్థాపించినది ఎవరు ?

### ధర్మం - సంస్కృతి

4. హైందవ ధర్మంలో తొలిపూజ అందుకునే దైవం ఎవరు ?
5. గరుడ వాహనుడు ఎవరు ?
6. రెండు తెలుగు రాష్ట్రాలలో సరస్వతీ మాత ప్రముఖ దేవాలయం ఎక్కడుంది ?

### గణిత - వైజ్ఞానిక అంశములు

7. "సున్న" ను కనిపెట్టినది ఎవరు ?
8. "ద మ్యాన్ హు న్యూ ఇన్ఫినిటి" ఎవరి జీవితానికి సంబంధించిన డాక్యుమెంటరీ చిత్రం ?
9. మానవ శరీరంలోని అతి పెద్ద ఎముక ఏది ?

### సామాజిక శాస్త్రాలు

10. భారతదేశంలో నిర్మించిన, అతి పెద్ద ఆనకట్ట ఏది ?
11. "భారతదేశ ఉక్కుమనిషి" ఎవరు ?
12. ఎక్కువ జీవిత కాలం గలిగిన జంతువు ఏది ?

### సమకాలీన అంశాలు

13. ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ఏది ?
14. భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు ?
15. 2025లో ఏ సంస్థ యొక్క శతజయంతి ఉత్సవములు జరుగుతున్నాయి ?

## లోక జ్ఞానము -204 సమాధానములు

1. యమున
2. శంకరాచార్యులు
3. 1925
4. గణపతి
5. కైలాసం
6. మంజునాథస్వామి
7. 11
8. 2 (పొ+వె)
9. చర్మం
10. ఆసియాఖండం
11. భారత రాష్ట్రపతి
12. అంతర్వేది
13. విశాఖపట్టణం
14. నవంబర్ 11
15. బీహార్

## 136 జతపరచుము సమాధానాలు

| | | |
|---|---|---|
| 1 | ట. | గరుత్మంతుడు |
| 2 | త. | వృషభం |
| 3 | క. | సింహం |
| 4 | ప. | నెమలి |
| 5 | చ. | శునకం |

## 137- జతపరచుము

| | | |
|---|---|---|
| 1. 1962 | ( ) | క. భారత్‌లో అత్యవసర పరిస్థితి |
| 2. 1975 | ( ) | చ. పాకిస్థాన్‌తో కార్గిల్ యుద్ధం |
| 3. 1999 | ( ) | ట. 370 ఆర్టికల్ రద్దు |
| 4. 2019 | ( ) | త. కోవిడ్ - 19 |
| 5. 2020 | ( ) | ప. భారత-చైనా యుద్ధం |

విద్యార్థులు గానీ,
ఆచార్యులు గానీ మీ సమాధానాలను వ్రాసి స్ఫూర్తి విభాగానికి తపాల / కొరియర్ ద్వారా పంపగలరు.
(లేదా)
sphoortissvp@gmail.com కి మెయిల్ ద్వారా పంపగలరు.

పోషకుల పేజి

# మన పిల్లలు నైపుణ్యాలకు ఎందుకు దూరమవుతున్నారు?




✍ - లింగం సుధాకర్ రెడ్డి

**ఆ** మధ్య ఓ వీడియో క్లిప్పింగ్ చూశాను-ఏదో కారణంగా కూతురు ఏడుస్తుంది. తల్లి చికాకుగా వచ్చి కూతురు చదువుకునే పాఠశాల ప్రధానాచార్యులకు ఫోన్ చేసి "ఏమండీ, పిల్లలకు మీరు ఏమి నేర్పిస్తున్నారు, ఇంత మొత్తంలో ఫీజు కడుతున్నది ఎందుకు? ఇదేనా మీ నేర్పే చదువు? అంటూ విసుగ్గా మాట్లాడింది. ఆ ప్రధానాచార్య ఇంతకు ఏమైందమ్మా!" అని అడిగింది. మా అమ్మాయి "అమ్మా!" అని ఏడుస్తున్నది- ఇంగ్లీషు మీడియంలో చేర్పించింది ఇందుకేనా? ఇంగ్లీషులో ఏడ్వకుండా, "అమ్మా" అని తెలుగులో ఏడుస్తున్నది. అంటూ మాట్లాడింది- ఇది తమాషాగానే అనిపించవచ్చు. జరుగుతున్నది మాత్రము ఇదే-ఇంగ్లీషు వద్దనడం లేదు, కాని మన భాష, తద్వారా మన సంస్కృతిని వదిలి పెట్టడం వలన మన పిల్లలు ఏమి కోల్పోతున్నారో తెలుపుతూ ఈ మధ్య ఈనాడు దిన పత్రికలో డా॥ఎస్. శివకుమార్ గారు "పంచ తంత్రంలో సాఫ్ట్ స్కిల్స్" శీర్షికన చాలా తర్క బద్ధంగా పిల్లల తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చాలా చక్కగా వ్రాసిన విషయాన్ని మీకందిస్తున్నాను.

నేటి జాబ్ మార్కెట్‌లో సాంకేతిక నైపుణ్యాల కన్నా ఎక్కువగా సాఫ్ట్ స్కిల్స్ అవసరం. గత కొన్నేళ్లుగా భారతీయ విద్యార్థులు ఈ నైపుణ్యాల్లో వెనకబడి ఉంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎమోషనల్ ఇంటెలిజెన్స్, లీడర్‌షిప్, రెజిలియెన్స్, ఎంపతీ వంటి నైపుణ్యాల లోపం వల్లే ఇంటర్వ్యూల్లో తిరస్కరణ, ఉద్యోగాల్లో తొలగింపు సమస్యలను-ఎదుర్కొంటున్నారు. నిజానికి అవేమీ బ్రహ్మవిద్యలు కావు. నేర్చుకోవాలే కానీ పంచతంత్ర కథలు చాలు, లోకజ్ఞానాన్నిచ్చే బోలెడు పాఠాలు నేర్పుతాయి.

పిల్లలు కథలు వినడమే కాదు, వాటిలోని



పాత్రలతో పోల్చు కుంటారు. వారికి తెలియకుండానే ఆ పాత్రలతో తమను తాము ఐడెంటిఫై చేసుకోవడం ద్వారా వాటి విలువలను, నైపుణ్యాలను అలవరచుకుంటారు. జపాన్లో ఏడెనిమిది ఏళ్లు నిండే వరకు పిల్లలకు మిగతా సబ్జెక్టుల కన్నా తమ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే కథలూ, కళలూ ఎక్కువగా నేర్పిస్తారు. దాంతో చిన్నప్పటి నుంచే వాళ్లకు ఆయా జీవన నైపుణ్యాలు అలవడుతున్నాయి. ఉద్యోగం కోసం ప్రత్యేకంగా నేర్చుకోవాల్సిన అవసరం రావడం లేదు. అలాంటి కథలు మనకూ ఎన్నో ఉన్నాయి. కానీ ఆంగ్ల మాధ్యమం చదువులు వాటిని పిల్లలకు దూరం చేస్తున్నాయి. ఉదాహరణకు పంచతంత్రంలోని కోతి- మొసలి కథ తీసుకుందాం. నది ఒడ్డున ఉన్న నేరేడు చెట్టుపై నివసించే కోతి పండ్లు పంచుతూ, మొసలితో స్నేహం చేసింది. మొసలి భార్యకు కోతిపై అసూయ. ఒక రోజు అది మొసలితో 'నాకు ఒంట్లో బాగాలేదు, కోతి గుండె తింటే బతుకుతాను కాబట్టి దాన్ని తెచ్చి పెట్టమని ఒత్తిడి చేసింది. అటు స్నేహం, ఇటు ప్రేమ మధ్య చిక్కుకున్న మొసలి చేసేదిలేక కోతిని తీసుకుని సగం దూరం వెళ్లాక నిజం చెప్పింది. కోతి భయపడకుండా, తెలివిగా బయటపడే ఉపాయాన్ని ఆలోచించింది. తన

గుండె చెట్టుపైనే ఉంచానని, వెనక్కి వెళ్లి తెద్దామని చెప్పి ఒడ్డుకు చేరగానే తప్పించుకుంటుంది. ఈ కథలోని ప్రతి ఘట్టం ఒక విలువైన సాఫ్ట్ స్కిల్‌ను సూచిస్తుంది.

- **ఎమోషనల్ ఇంటెలిజెన్స్:** విషయం తెలియగానే కోతి మొసలిని నిందించకుండా, ఆవేశపడకుండా పరిస్థితిని అర్థం చేసుకుంది.
- **క్రిటికల్ థింకింగ్:** ప్రాణాపాయ పరిస్థితుల్లోనూ చురుగ్గా ఆలోచించింది.
- **కమ్యూనికేషన్ స్కిల్స్:** నమ్మకం కలిగించే మాటలతో సమస్యకు పరిష్కారం సాధించింది.
- **డెసిషన్ మేకింగ్:** స్నేహితుణ్ని నొప్పించకుండా తన ప్రాణాలను కాపాడుకోవడంపై దృష్టి పెట్టింది.
- **బౌండరీస్, నైతికత:** స్నేహమైనా మరొకటైనా అనుబంధానికీ హద్దులు ఉంటాయని చాటుతూ తప్పుకొంది తప్ప ప్రతీకారం తీర్చుకోవాలను కోలేదు.

ఇలాగే ప్రతి కథనీ విశ్లేషించుకోవచ్చు. ఒక కథ చెప్పాక పిల్లల్ని దాన్ని ఎలా అర్థం చేసుకున్నారో చెప్పమంటే ఈ కోణాలన్నీ చర్చకు వస్తాయి. పసి మనసులమీద అవి వేసే ముద్రలు వాళ్ల వ్యక్తిత్వంలో భాగమైపోతాయి. అప్పుడిక జీవన నైపుణ్యాలు తెలియవన్న ప్రశ్నే తలెత్తదు. ★

**కిసాన్‌గల్లి :-** శ్రీ సరస్వతీ శిశు మందిరం కిసాన్‌గల్లి పాఠశాల భైంసాలో 2012-2013 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 65 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఆనాడు చదివిన తీపి జ్ఞాపకాలు, అనుభూతులు, అల్లరి పనులు, చదువు గురించి పరస్పరం పంచుకోవడం జరిగింది. అలాగే అపుడు బోధించిన ఆచార్యులను సన్మానించారు. పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ సుమారు రూ॥ 45,000/లు వస్తువును విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు సరికొండ దామోదర్ విభాగ్ (కార్యదర్శి), కళిమహంతి వేణుమాధవ్ (విభాగ్ శైక్షణిక ప్రముఖ్), కిసాన్‌గల్లి , పురస్తు



గోపాల్ కిషన్. (జిల్లా కార్యదర్శి), కుంట కాశీనాథ్ పాఠశాల (అధ్యక్షులు) మిగిలిన ప్రబంధకారిణి సలహా సమితి సభ్యులు పాల్గొన్నారు. ★



**బండమీదిపలి:-** పాలమూరు విభాగ్ లోని జిల్లా కేంద్ర పాఠశాల సరస్వతీ శిశు మందిరము పాలమూరు (బండమీదిపల్లి) సంచాలితముగా నడుస్తున్న శ్రీ సరస్వతీ బాల సంస్కార కేంద్రాన్ని సరస్వతీ విద్యా పీఠము ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కృష్ణ మోహన్ ప్రధానాచార్యులు మాతృమూర్తి శ్రీమతి శ్రీదేవి గారు సందర్శించారు. ★

**మనసు చెప్పినట్లు మనం వినడం కాదు**
**మనం చెప్పినట్లు మనసు**
**వినేలా చేసుకోవాలి ....**
**- గౌతమ బుద్ధుడు**

# చదవడం-ఒక మంచి అలవాటు



- కొత్తపల్లి ఉమ,
ప్రాంత శిశువాటిక ప్రముఖ్, తెలంగాణ

చదవడం (Reading) ఒక అద్భుతమైన అలవాటు. ఇది చిన్ననాటి నుంచే అలవాటు చేయడం చాలా ముఖ్యం, ఎందుకంటే ఇది పిల్లలలో భాష. ఊహాశక్తి, మరియు భావోద్వేగ బంధం యొక్క పునాదిని వేస్తుంది.

**పుట్టినప్పటి నుండి చదవడం అలవాటు చేసే సరళమైన విధానం:**

**0-18 నెలలు:**

- ఏదైనా ఉచ్చరించండి - పుస్తకాలు, మీ మెసేజ్‌లు, వంటకాలు కూడా! శబ్దంలోని ఛందస్సు, స్వరం పిల్లలకి ఎంతో మధురంగా ఉంటుంది.
- కాంతి వ్యత్యాసం ఉన్న చిత్రాలతో పుస్తకాలు ఎంచుకోండి-ఇవి చూపు అభివృద్ధికి తోడ్పడతాయి.
- పిల్లల్ని మీరు దగ్గరగా కూర్చోపెట్టుకుని చదవండి- అలా చదవడం అంటే సుఖం మరియు బంధం అని వారు నేర్చుకుంటారు.
- చిత్రాలను చూపించి పేరు చెప్పండి "అది పిల్లి! మియావ్!", "అది చంద్రుడు!". "అవి నక్షత్రాలు!" వంటి మాటలతో.
- కొద్దిసేపు చదివించండి. కానీ తరచుగా చేయండి రోజులో రెండు మూడు సార్లు కొద్దిసేపు సరిపోతుంది.
- మీ బిడ్డ పేజీలు తిప్పడానికి ప్రోత్సహించండి (ఊరికే తిప్పినా పరవాలేదు).
- సాధారణ ప్రశ్నలు అడగండి ("కుక్క ఎక్కడుంది?) సమాధానం ఇచ్చినప్పుడు ప్రశంసించండి.
- చదవటం రోజువారీ అలవాటుగా మార్చండి- నిద్రపోయే ముందు, భోజనం తర్వాత, లేదా ఖాళీ సమయంలో.
- పిల్లలు చిత్రాలను చూపించడం ప్రారంభించినప్పుడు- మీరు వాటి పేర్లు స్పష్టంగా చెప్పండి.
- హావభావాలతో చదవండి-ఇది కథలను మరింత సజీవంగా చేస్తుంది.
- పిల్లలు ఇష్టపడే కథలను తరచుగా పునరావృతం చేయండి- ఇది భాషా అభివృద్ధికి సహాయం చేస్తుంది.

**18-24 నెలలు: పాల్గొనడం మరియు కథ అర్థం చేసుకోవడం ప్రారంభం**

- మీతో కలిసి చదవడాన్ని ప్రోత్సహించండి. వదిలేసిన మాటలు పూరించండి.
- చిత్రాల గురించి మాట్లాడండి మరియు వాటిని వాస్తవ జీవితానికి అనుసంధానం చేయండి ("మన దగ్గర ఆపిల్ ఉంది").
- పిల్లలే ఏ పుస్తకం చదవాలో ఎంచుకునేలా చేయండి.
- పఠన సమయాన్ని తక్కువగా, సరదాగా, పిల్లల మనస్తత్వానికి అనుగుణంగా ఉంచండి.
- పుస్తకం పూర్తిగా చదవకపోయినా బాధపడకండి-లక్ష్యం సాన్నిహిత్యం మరియు పరిచయం మాత్రమే.
- పిల్లలు సులభంగా తీసుకోగలిగేలా పుస్తకాలను అందుబాటులో ఉంచండి.
- హావభావాలతో ఉండండి, స్వరంలో ఉత్సాహం, ముఖాభినయం, ప్రేమ చూపండి.
- సాధ్యమైతే గ్రంథాలయాల్లో జరిగే బేబీ స్టోరీ టైమ్ కార్యక్రమాలకు తీసుకెళ్లండి (సాధారణంగా 6-12 నెలల వయసు నుంచే).

**2 నుండి 4 సంవత్సరాలు: కథల మాధుర్యం (Story telling) ఎలా చదవాలి:**

- పిల్లలకే పుస్తకం ఎంచుకునే అవకాశం ఇవ్వండి-ఇది వారికి స్వతంత్రత, ఉత్సాహం ఇస్తుంది.

- ప్రశ్నలు అడగండి: “ఇప్పుడు ఏం జరగబోతుంది?”, “కుక్క ఎక్కడుంది?”
- కథలను వాస్తవ జీవితానికి కలపండి: “మనం కూడా ఆపిల్ తింటాం కదా!”
- పిల్లలు ఇప్పుడు పెద్ద కథలు, పాత్రలు, కారణం–ఫలితం వంటి అంశాలను అర్థం చేసుకోగలరు.
- “ఎందుకు?”, “ఎలా?” వంటి ప్రశ్నలు అడగండి– “కుక్క ఎందుకు దుఃఖించింది?”
- ఊహించమని ప్రోత్సహించండి: “తరువాత ఏమి జరుగుతుందో చెప్పు చూద్దాం!”
- కథలోని భావాలు లేదా పాఠాల గురించి పిల్లలతో మాట్లాడండి.
- పిల్లలు చదివిన భాగాలను “బట్టి పట్టడానికి” ప్రోత్సహించండి.
- గ్రంథాలయాలు సందర్శించండి లేదా ఇంట్లో ఒక చిన్న “reading corner” ఏర్పాటు చేయండి.
- పుస్తకాలను పిల్లల ఎత్తులో, సులభంగా తీసుకునేలా ఉంచండి.
- పఠనాన్ని రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా ఉంచండి (నిద్రకు ముందు, ఆట తర్వాత, లేదా ఖాళీ సమయాల్లో).
- పిల్లల్లో ఆసక్తిని పెంచడం. పిల్లలు ఒకే పేజీ గురించి 10 నిమిషాలు మాట్లాడాలనుకుంటే అది నేర్చుకోవడమే!
- మీరు కూడా చదువుతుంటే చూపించండి వారు తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకుంటారు.
- చదవడం ఎప్పుడూ సరదాగా, ఆటలా ఉంచండి కథలు, పాటలు, ఫింగర్ రైమ్స్, పపెట్ షోలు ఇవన్నీ పఠనంలో భాగం. ★

(తరువాయి భాగం వచ్చే సంచికలో...)



**ఆత్మకూరు:–** శ్రీ సరస్వతీ విద్యా మందిరం ఆత్మకూరు పాఠశాల పునః ప్రారంభం చేయు నిమిత్తం, 21.11.2025 తేదీన ఆత్మకూరులోని కార్యకర్తలతో హితైషుల సమావేశం ప్రబంధకారిణి ఏర్పాటు కొరకు నిర్వహించబడింది. ఈ సమావేశంలో విప్పల శివ నాగిరెడ్డి గారు జిల్లా అధ్యక్షులు నంద్యాల, అంబటి పరంధామ రెడ్డి గారు జిల్లా కార్యదర్శి, వి సి నరసింహులు గారు అనంతపురం సమితి AO మరియు విభాగ్ కార్యకారిణి, సభ్యులు ఇద్దరు విభాగ్ శైక్షణిక ప్రముఖ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంయోజక్‌గా వాసుదేవ రెడ్డి గారు వ్యవహరించారు. 25 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ★



**ఆదర్శనగర్:–** ఆదిలాబాద్ విభాగ్ లోని నిర్మల్ జిల్లా కేంద్రములో శ్రీ సరస్వతీ శిశు మందిరము నిర్మల్ (ఆదర్శనగర్) సంచాలితముగా నిర్వహించబడుతున్న శ్రీ సరస్వతీ బాల సంస్కార కేంద్రమును సందర్శించిన ప్రాంత సంఘటనా కార్యదర్శి.

**KDR నగర్, వనపర్తి:–** కేడీఆర్ నగర్ పాఠశాలలో ఉచిత హోమియో వైద్య శిబిరం. శ్రీ సరస్వతీ శిశు మందిర్ వనపర్తిలోని కేడీఆర్ నగర్ లో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం జరిగింది. ప్రముఖ హోమియో వైద్యులు డా॥నీలకంఠం పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు, ప్రబంధ కారిణి సభ్యులు, పోషకులు పాల్గొన్నారు. ★

# స్వదేశీ ఉద్యమ నాయకుడు
# బాబుగేను



✍ - రావుల సూర్యనారాయణ

బ్రిటీష్ వారి క్రూరహింసలను ఎదుర్కొని పోరాడి బలిదానమైన స్వాతంత్ర్య సమరయోధులలో చరిత్రకెక్కినవారు కొందరైతే, చరిత్ర-కెక్కని వారు అనేకమందిలో ఒకరు బాబుగేను.

భారతదేశం బానిసత్వంలో మగ్గుతున్న రోజులవి, భారతదేశ ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి తమ బ్రిటిష్ దేశంలో ఉత్పత్తిని పెంచుకొనుటకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగించింది బ్రిటిష్ ప్రభుత్వం. భారతదేశం నుండి ముడి సరుకులను పంపించుటకు ప్రకృతి వనరులను నాశనం చేశారు. తద్వారా ఇంగ్లాండులో ఉత్పత్తిని పెంచి భారతీయ కుటీర పరిశ్రమలను దెబ్బతీయటానికి ఇంగ్లాండు పరిశ్రమలు స్థాపించారు, అందులో ఉత్పత్తి చేసిన వస్తువులను భారత మార్కెట్టులో అమ్మడం ప్రారంభించారు. బ్రిటిషు దేశం నుండి వచ్చే వస్తువులను ప్రోత్సహించుటకు సుంకాలను తగ్గించారు. భారత్‌లో తయారైన వస్తువులపై అధికంగా సుంకాలను విధించారు. తద్వార భారతీయులు చవకగా వచ్చే విదేశీ వస్తువులను కొనటం ప్రారంభించారు. దాంతో స్వదేశంలోని కుటీరపరిశ్రమలు మూతపడటం, లక్షలాది మందికి ఉపాధి కరువై ఆకలితో అలమటించారు. ఇది అనేక మందిని కలవర పరిచింది. బ్రిటిష్ దేశం నుండి వచ్చిన వస్తువులను వాడుతూ స్వతంత్రం కోసం పోరాడటంతో అర్థం లేదని భావించారు.

ఈ ఆలోచనతో 1905 సం॥లో మహారాష్ట్ర మరియు పశ్చిమ బెంగాల్ లలో **"విదేశీ వస్తువులను బహిష్కరించండి - స్వదేశీ వస్తువులను ఉపయోగించండి"** అనే నినాదం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక శస్త్రం అయింది. మహారాష్ట్రలోని పూనాలో వినాయక దామోదర సావర్కర్ ఆధ్వర్యంలో 7వ అక్టోబరు 1905 న విదేశీ వస్త్రాలను అగ్నికి ఆహుతి చేయడం ప్రారంభించారు. బెంగాల్‌లో ఇదే పని 1905 అక్టోబరు 16 నుండి ప్రారంభమైంది. 1906 సం॥లో నిర్వహించిన కాంగ్రేస్ సమావేశంలో ఆనాటి అధ్యక్షులు దాదాబాయి నౌరోజీ బ్రిటిష్ వారు చేస్తున్న ఈ దోపిడీని "drain of wealth" (దేశ సంపదను తరలించడం) పేరుతో నాలుగు అంశాలను సభ ముందుంచారు. 1) స్వదేశీ వస్తువులు 2) విదేశీ వస్తువులను బహిష్కరించడం 3) జాతీయ విద్యను పున: ప్రారంభించడం 4) స్వరాజ్యాన్ని సంపాదించడం. ఈ అంశాలను అందరూ సమర్థించారు. ఆ తదుపరి 25 సం॥లు ఈ పని జరిగింది. స్వదేశీ ఉద్యమాన్ని మహర్షి అరవిందులు, రవీంద్రనాథ్ ఠాగూర్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వంటి పెద్దలు ప్రజలలోకి ఉద్యమ రూపంలో తీసుకొని వెళ్లారు. 1930 సం॥లో దేశం మొత్తంలో ఇది ప్రచండ ఉద్యమ రూపం దాల్చింది. స్వతంత్ర ఉద్యమంలో పాల్గొంటున్న వారందరూ ఖద్దరు ధరించడం, గాంధీజీ ఆధ్వర్యంలో చరఖాతో నూలు వడికి వస్త్రాలను తయారు చేయడం జరిగింది. విదేశీ వస్తువులు అమ్మే దుకాణాల ముందు ధర్నాలు చేయడం, స్వదేశీ వస్తువులు అమ్మే దుకాణాల ముందు జాగృతం చేసే పని తీవ్రంగా జరిగింది. విశేషంగా ఈ ఉద్యమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, స్వదేశీ ఉద్యమం స్వాతంత్ర్యోద్యమం గతిని మార్చివేసింది.

బాబుగేను ఒక సాధారణ శ్రామికుడు. ముంబైలోని ఒక బస్తీలో ఉండేవాడు. పెద్దగా చదువుకోలేదు. కాని సామాజిక, జాతీయ పరిస్థితులను బాగా అర్థం చేసుకున్నవాడు. 1926-27లో తన మిత్రుడైన ప్రహ్లాద్ తో స్వతంత్ర ఉద్యమ ఆందోళనలో పాల్గొన్నాడు. తన మిత్రులందరి సహకారంతో **"చరఖా నిధి"** ని తయారు చేసి ప్రతి రోజు అందరూ కొంత సమయం చరఖా తో నూలు వడికి ఖాదీ వస్త్రాలు తయారు చేసి వాటిని ధరింప చేయడానికి ప్రేరణ నిచ్చాడు. 1928 సం॥లో సైమన్ కమీషన్

భారత్‌లో అడుగు పెట్టరాదని **"సైమన్ కమీషన్ గోబ్యాక్"** అనే ఉద్యమం జరిగింది. దేశ వ్యాప్తంగా జరిగిన ఈ ఉద్యమంలో బాబుగేను పాల్గొని జైలుకు వెళ్లాడు.

**"సవినయ్ అనిజ్ఞ్ ఆందోళన్"** 12-03-1930 న గాంధీజీ నేతృత్వంలో ప్రారంభమైంది. సముద్రం ఒడ్డుకు వెళ్లి శాసనానికి వ్యతిరేకంగా ఉప్పు తయారు చేయడం అనేది స్వతంత్ర ఉద్యమంలో ఒక భాగమైంది. ఈ ఉద్యమాన్ని ముంబైలో బాబుగేను సారథిగా ఉండి నడిపించాడు. దాంతో అతనిని అరెస్టు చేసి జైల్లో వేసారు.

బాబుగేను జైలు నుండి విడుదలైన తర్వాత **"తానాజీ పథక్"** అను పేరుతో స్వదేశీ ఉద్యమాన్ని తీవ్ర గతిన నడిపించాడు. జన జాగరణ ప్రారంభించాడు. బ్రిటిష్ దేశం నుండి వచ్చే వస్తువులన్నీ నౌకల ద్వారా ముంబైలోని **"బందర్ గాహ్"** ఓడ రేవు వచ్చేవి. ఈ కారణంగా ముంబై ఈ ఉద్యమానికి కేంద్రంగా నిలిచింది.

స్వతంత్ర ఉద్యమంలో తనతో పాల్గొన్న వారందరిని ఈ ఉద్యమంలో భాగస్వాములుగా చేశారు బాబుగేను. వీరిలో ముఖ్యమైన కొందరు కలిసి ఓడ రేవుకు బ్రిటిష్ దేశం నుండి ఎప్పుడు సామగ్రి చేరుకుంటుంది, ఆ సామగ్రిని లారీలలో ఏయే ప్రాంతాలకు ఎప్పుడు తరలిస్తారనే విషయాన్ని తెలుసుకున్నారు. దీన్ని ఆధారం చేసుకొని 12 డిసెంబర్ 1930 న సత్యాగ్రహానికి పిలుపు నిచ్చాడు బాబుగేను. ఉన్ని వస్త్రాలతో వచ్చే లారీలను ఆపటానికి ప్రణాళిక సిద్ధమైంది. సత్యాగ్రహం చేసే స్థలానికి ఉద్యమ కారులందరూ చేరుకుంటున్నారు. పోలీసు వారు సత్యాగ్రహాన్ని ఆపటానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. 'కాల్‌బాదేవి' రహదారిపై ఉత్తేజ పూరకమైన వాతావరణం నెలకొనియుంది. బాబుగేను తన ముఖ్య అనుచరులైన ప్రహ్లాద్ రావుత్, శంకర్ ఆప్టేలతో అక్కడికి చేరుకొన్నాడు. మాంచెస్టర్ టెక్స్‌టైల్ మిల్ నుండి లారీలు బయలు దేరాయి. కొద్ది సేపట్లో ఒక లారీ అటువైపు పోలీసుల సహాయంతో రావటం ఉద్యమ కారులు గమనించారు. సత్యాగ్రహాలకు ఇది పరీక్షా సమయం. బాబుగేను పిలుపుతో దోండు దేవంకర్ తిరంగా జెండా చేతబూని వేగంగా వెళ్లి లారి ముందు పడుకున్నాడు. దాంతో లారీ ఆగింది.

సత్యాగ్రహంలో పాల్గొన్న వారందరి నోటి నుండి వచ్చిన వందేమాతరం, భారత్ మాతాకీ జై అను నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. పోలీసులు వచ్చి దొండేని లాగి లారి నుండి దూరం చేశారు. లారీ నడవడం ప్రారంభించటంతో మరో సత్యాగ్రహి సాహసంతో లారీ ముందు పడుకొన్నాడు. దాంతో సడన్ బ్రేక్ వేసి లారీని ఆపారు. పోలీసులు లాఠీలతో అందరిని చెదరగొట్టారు. కాని లారీ ముందు పడుకున్న సత్యాగ్రాహి హింసను భరించాడు కాని అంగుళం కూడా కదలలేదు. దాంతో పోలీసులు వచ్చి ఎత్తుకు పోయి దూరంగా వదిలివేసారు.

బాబుగేను ఇదంతా గమనించి స్వయంగా తానే వెళ్లి లారీ ముందు పడుకున్నారు. ఇది చూసిన జనమంతా లారీ వద్దకు రావటం, లారీ ముందు పడుకోవటంతో అక్కడున్న సార్జెంట్ అసహనంతో లాఠీ చార్జ్ చేయమని పోలీసులను ఆదేశించాడు. అప్పుడు పోలీసు బలగాలు ముందుకు వచ్చి పడుకున్న వారిని చితక బాదుతూ అతి కౄరంగా ప్రవర్తించి అరెస్టు చేశారు. బాబుగేనును కూడా అతికౄరంగా హింసించారు. స్వతంత్ర భారత చిత్రం ఆయన కళ్ల ముందు కన్పించింది. ఎంత బాధించినా కదలలేదు. దాంతో సార్జెంట్ లారీని బాబుగేను పైనుండి లారిని తోలమని డ్రైవర్‌ను ఆజ్ఞాపించాడు. భారతీయుడైన ఆడ్రైవర్ ఆ పని చేయడానికి నిరాకరించాడు.

కోపోద్రిక్తుడైన సార్జెంట్ స్వయంగా లారీ నడపటం ప్రారంభించాడు. లారీ బాబుగేను దగ్గరికి వస్తుంటే **"వందేమాతరం"- "భారత్ మాతాకీ జై"** అంటూ అందరిని ఉత్తేజ పరుస్తున్నాడు బాబుగేను. మరింత దగ్గరికి వచ్చినా ఏ మాత్రం చలించలేదు. జనం ఊపిరి బిగబట్టి చూస్తూ ముందుకు వస్తుంటే పోలీసు వారు నిర్దాక్షిణ్యంగా హింసిస్తున్నారు. అపుడు బాబుగేమ ముఖంలో విజయ మందహాసం కన్పించింది, చివరగా ఒకసారి గట్టిగా భారతమాతాకీ జై అనే నినాదాన్ని అందరితో పలికించాడు.

(తరువాయి భాగం 30వ పుటలో...)

పుస్తక పరిచయం

# విద్యార్థిలోకం ... వికసించే శ్లోకం

## సదాచారం-3



శ్రీ సరస్వతీ విద్యాపీఠం
ప్రచురణ

**పుస్తక పరిచయం :** అద్దేపల్లి నరసింహారావు


ప్రతిరోజు చదివే వార్తలలో నేరపూరిత ఘటనలు, ఘోరాలు ఎక్కువ ఉంటున్నాయి. వీటిలో చదువుకున్న వారు, ఉన్నత విద్యను అభ్యసించిన వారు కూడా దారుణాలకు పాల్పడుతున్న తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది. **'సమాజం ఎక్కడికి పోతోంది'** అని బాధపడుతున్నారు, కోట్లాది మంది బాధ్యతగల పౌరులు. పాఠశాలలు, కళాశాలలు విద్య నేర్పుతున్నాయే గానీ విలువలు బోధించడం లేదు. అందుకే శిశుమందిరాలలో ప్రభుత్వ పాఠ్య ప్రణాళిక ప్రకారం చెప్పే పాఠాలతో పాటు నైతిక ఆధ్యాత్మిక విద్యను అందిస్తున్నారు. ఆ విద్యే **'సదాచారం'**. 3వ, 4వ, 5వ తరగతి **'సదాచారం'** పాఠ్య పుస్తకాలను పరిచయం చేయడం ఈ వ్యాసం లక్ష్యం.

**'ఆదర్శ గృహం'తో ప్రారంభం....**

3వ తరగతి సదాచారం పుస్తకం **'ఆదర్శ గృహం'** అంటే ఏమిటో వివరించడంతో ప్రారంభం అవుతుంది. శ్లోకాలు, పద్యాలు, కథలు, చిత్రాల ద్వారా ఉన్ముఖీకరణ, సూక్తులు, గేయాలు, సుభాషితాలు, దేశభక్తుల జీవితగాథలు, కృత్యాలు తదితర ప్రక్రియల ద్వారా వివిధ అంశాలను బోధించే ప్రయత్నం జరిగింది. విద్యార్థి సాధించవలసిన లక్ష్యాలను ఎంతవరకూ సాధించారో తనకుతానే అంచనా వేసుకొని వ్యక్తపరిచే స్వీయ మూల్యాంకనం ప్రయోగం - విద్యార్థిని క్రమ క్రమంగా వ్యక్తిత్వ వికాస మార్గంలోకి తీసుకువెళుతుంది. జాతీయ చిహ్నాలను సూచించడంతో పుస్తకం ముగుస్తుంది.

**భావనలపై మరింత దృష్టి....**

**'స్వచ్ఛత'** నుంచి **'ధైర్యం'** దాకా వివిధ భావనలపై బాల్యంలోనే లోతైన అవగాహన, అనురక్తి పెంచే ప్రయత్నం 4వ తరగతి పుస్తకంలో కనబడుతుంది. అంటే ఒక్కొక్క భావాన్ని తీసుకుని దానినే వివిధ ప్రక్రియల ద్వారా వివరించి విద్యార్థిలో ప్రేరణ కలిగించే ప్రయత్నం ఎంతో ప్రతిభావంతంగా జరిగింది. 5వ తరగతి పుస్తకం కూడా దాదాపు ఇదే విధానంలో కొనసాగింది. ఈ దశలో విద్యార్థి మేధస్సుకు పరీక్ష పెట్టే చర్చలు, కృత్యాలు, సూచనలు పెరుగుతాయి. రోగాలు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించడంతో ప్రారంభం అయ్యే ఈ పుస్తకం, మానసికంగా దూరం పెట్టాల్సిన భావోద్వేగాలను వివరించడంతో ముగుస్తుంది. బాల్య దశ నుంచే విద్యార్థిని భౌతికంగా, మానసికంగా, మేధోపరంగా, సంస్కారవంతంగా మార్చే దీక్షా ఫలాలే ఈ పుస్తకాలు.




**విద్యాభారతి ప్రణాళిక**

విద్యాభారతి పాఠ్య ప్రణాళికను అనుసరించి ఉదయ తరగతి (జూనియర్ కె.జి.) నుంచి పదవ తరగతి దాకా 'సదాచారం' పేరుతో పుస్తకాలను రూపొందించారు. విద్యావేత్తలు రూపొందించిన ఈ పుస్తకాల లక్ష్యం విద్యార్థులకు నైతిక, ఆధ్యాత్మిక విద్యను అందించడం. ఈ పుస్తకాలను పరిచయం చేసే రెండు వ్యాసాలను 'స్ఫూర్తి' పత్రిక సెప్టెంబర్, అక్టోబరు సంచికలలో ప్రచురించారు. ఆ వ్యాసాల పరంపరలో ఇది మూడవది.

**రచన**

**రచయితలు:** శ్రీసరస్వతీ విద్యాపీఠం పూర్వ ప్రధానాచార్యులు డా॥ ముత్తేవి శ్రీనివాస్, పూర్వాచార్యులు శ్రీమతి ముత్తేవి లక్ష్మి.

**సహకారం:** శ్రీసరస్వతీ శిశుమందిర్ పూర్వ ప్రధానాచార్యులు శ్రీమతి అనురాధ, శ్రీ సరస్వతీ విద్యాపీఠం పూర్వ ప్రధానాచార్యులు శ్రీ బెల్లాల సుగుణాకర్

**సమన్వయం:**
దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి శ్రీ అయాచితుల లక్ష్మణరావు, దక్షిణ మధ్య క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ శ్రీ రావుల సూర్యనారాయణ

**ప్రతుల కోసం**

శ్రీసరస్వతీ విద్యాపీఠం, సాహిత్య విభాగం, ఇం.నెం.6-3-597/ఎ/7, వెంకటరమణ కాలనీ, ఖైరతాబాద్, హైదరాబాద్-04. ఫోన్.నెం.040-23316084, 9441866647లో సంప్రదించవచ్చు.

వెల: 3వ తరగతి పుస్తకం రూ॥60/-లు,
4వ తరగతి పుస్తకం రూ॥80/-లు.
5వ తరగతి పుస్తకం రూ॥75/-లు.

ఆ క్షణమే లారీ బాబుగేను తలపై నుండి వెళ్లింది, రోడ్డు రక్తసిక్తమైంది. ఆ రక్తపు మడుగులో ఉన్న బాబుగేనును చూసిన జనం ఆక్షణం సంయమనాన్ని కోల్పోయి పోలీసులపై తిరగబడి లారీ టైర్లను పంక్చర్ చేశారు.

బాబూగేను గోకుల్‌దాస్ తేజ్‌పాల్ ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. సాయాత్రం. 4.30 ని॥లకు బాబుగేను అంతిమశ్వాస వదిలాడు. ఆసుపత్రి దగ్గరకు వేల మంది చేరారు. వారిని ఆపడం పోలీసుల తరం కాలేదు. సా॥5 గం॥లకు ఆసుపత్రి వర్గాలు మరణ వార్తను ప్రకటించారు.

ఈ వార్త ముంబై నగరమంతా వ్యాపించింది. ఆసుపత్రి, ప్రమాదం జరిగిన చోటుకు వేలాది మంది చేరుకున్నారు. మహిళలందరూ ప్రమాదం జరిగిన స్థలాన్ని పూలమాలలతో అలంకరించారు. తెల్లవారి 13వ తేదీ న అంతిమ యాత్ర ప్రారంభమైంది. కాంగ్రెస్ నాయకులు ఆయాత్రలో పాల్గొన్నారు లక్షలాది మంది ముంబై ప్రజలు ఈ అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించారు. స్వదేశీ వస్తువులను ఉపయోగిస్తామని విదేశీ వస్తువులను బహిష్కరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆ తరువాత జరిగిన విరాట్ శ్రద్ధాంజలి సభకు సాహితీ వేత్త శ్రీమతి లీలావతి మున్షి అధ్యక్షత వహించారు. కె.యం. మున్షి, జమునా లాల్ బజాజ్ లాంటి అనేక మంది పెద్దలు, 20 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన రోడ్డుకు బాబుగేను రోడ్డు అని పేరు పెట్టారు. ఇది మనకందరికి స్ఫూర్తి నిచ్చే విషయం.

స్వదేశ విషయం లో నేటి తరానికి ప్రేరణనిస్తుంది ఈ ఘటన. **ప్రతి పాఠశాలలో డిసెంబర్ 12న బాబుగేను వర్ధంతిని నిర్వహించాలి.** మనం ప్రతి ఒక్కరం విదేశీ వస్తువులు మన జీవితం నుండి క్రమంగా బహిష్కరిస్తే వారికి వాస్తవ శ్రద్ధాంజలి తెలిపినవారం కాగలం. ఇదే ప్రతిజ్ఞ అందరిచే చేయించాలి. ★

**భారత మాతాకీ జై !**



**సప్తశక్తి సంగం కార్యక్రమ పుస్తకావిష్కరణ చేసిన డి ఈ ఓ అశోక్ గారు**

**ఆర్మూరు :–** నిజామాబాద్ జిల్లా ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డి ఈ ఓ ) టి. అశోక్ గారి ని కలిసి సప్తశక్తి సంగం కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం జరిగింది. వారితో కర పత్రం మరియు పుస్తక ఆవిష్కరణ చేయించడం జరిగింది. వారు మాట్లాడుతూ శ్రీ సరస్వతీ శిశు మందిరాలు చాలా మంచి కార్యక్రమాలను నిర్వహణ చేస్తున్నాయని అందులో భాగంగా ఆవిష్కరణ చేసిన సప్తశక్తి సంగం కూడా చాలా గొప్ప కార్యక్రమం అని, మహిళల్లో వివిధ అంశాల పట్ల అవగాహన కల్పిస్తూ సమాజసేవలో శిశుమందిరాలు ముందుంటున్నాయని కొనియాడారు. మహిళలకు కుటుంబ ప్రబోధన్ మరియు పర్యావరణం పై అవగాహన చాలా గొప్ప అంశం అని డి ఈ ఓ అశోక్ గారు కొనియాడారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి రవినాథ్, కోశాధికారి కీర్తి సుదర్శన్, ప్రభందకారిణి కమిటీ కార్యదర్శి ప్రసన్న కుమార్ గౌడ్, మేనేజ్‌మెంట్ భాను తేజ్, ప్రిన్సిపల్ వినోద్ కుమార్‌లు పాల్గొన్నారు. ★



**ఆళ్ళగడ్డ :–** శ్రీ భారతి విద్యామందిరం, అమ్మవారిశాల వీధి, ఆళ్లగడ్డ లో విద్యా భారతి అఖిల భారతీయ సంస్కృతీ సంస్థ నిర్వహిస్తున్న **"సప్త శక్తి సంగం"** కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా **ఇన్నర్ వీల్** మెంబర్ శ్రీమతి గాయత్రి గారు మరియు వృక్ష యజ్ఞం వ్యవస్థాపకురాలు శ్రీమతి లావణ్య గారు , స్కూల్ పేరెంట్స్ మరియు ఆచార్య బృందం పాల్గొన్నారు... ★

# మహిళల్లో చేతనా స్ఫూర్తిని నింపుతున్న "సప్తశక్తి సంగం"



అమరాపురం

**రా**ష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది కార్యక్రమాల నేపథ్యంలో విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ "సప్త శక్తి సంగం" (మాతృశక్తి సమ్మేళనం) నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే శ్రీ సరస్వతీ విద్యా పీఠం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో "సప్త శక్తి సంగమం" ఘనంగా జరుగుతోంది.

ఈ కార్యక్రమం అంతా కూడా మహిళా ఆచార్యులు, మాతృమూర్తుల ఆధ్వర్యంలోనే నడుస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూడా మహిళలే వస్తున్నారు. అలాగే పాఠశాల ఆధ్వర్యంలో నడిచే ఈ కార్యక్రమానికి పాఠశాల మహిళా పోషకులు, బస్తీల్లోని మహిళలనే పిలుస్తున్నారు.

సమాజంలోని మహిళా ప్రముఖులు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళా ప్రముఖులను అతిథులుగా పిలుస్తున్నారు. ఈ సందర్భంగా భారతీయ దృష్టి కోణంలో కుటుంబ ప్రబోధన, పర్యావరణం పాత్ర, తత్వంతో పాటు కుటుంబంలో మహిళల పాత్ర, పర్యావరణం, పంచపరివర్తనలో మహిళల పాత్ర గురించి అతిథులు మాట్లాడుతున్నారు. అలాగే భారత దేశ ఉన్నతిలో మహిళల పాత్ర ఎలా వుండేది? ఇప్పుడు ఎలాంటి పాత్రను పోషించాలో కూడా విడమరిచి చెబుతున్నారు. దీని ద్వారా భారతీయ మహిళలో వున్న వీరత్వ గుణాలు, ధైర్య గుణాలు తిరిగి శక్తిమంతం చేయడానికి కూడా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోంది.

అలాగే కుటుంబంలో మహిళ పాత్ర ఎలా వుంటుందో కూడా ఈ కార్యక్రమం ద్వారా మరోసారి గుర్తు చేస్తున్నారు. పిల్లలు దేశభక్తులుగా, మంచి పౌరులుగా తయారవడంలో మాతృమూర్తుల పాత్ర గురించి కూడా కూలంకషంగా విడమరిచి చెబుతున్నారు. మన పురాణాలు, వేదాలతో పాటు స్వాతంత్రోద్యమంలోని వివిధ ఘట్టాలను ఉట్టంకిస్తూ మహిళలు చేసిన పోరాటాలు, వారి పాత్రలను వివరిస్తున్నారు.

అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా సమాజంలోని విశిష్ట మహిళలకు, ఉమ్మడి కుటుంబంలో వున్న మహిళలకు సన్మానం కూడా చేస్తున్నారు. మరోవైపు ఈ కార్యక్రమం పూర్తైన తర్వాత ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అనుభవాలను మహిళలు పంచుకుంటారు. ఆ తర్వాత చివరగా మహిళలందరితో సంకల్పం చేయించి, కార్యక్రమం ముగుస్తుంది. ★

---




## కామారెడ్డి భగత్ సింగ్ నగర్ పాఠశాలలో "సువర్ణ ప్రాశన"

కామారెడ్డి పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కాలనీలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో "సువర్ణ ప్రాశన" జరిగింది. ఇందులో స్థానికులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. గాయత్రీ మాత యజ్ఞం తో పాఠశాల కమిటీ సభ్యులు దీనిని ప్రారంభించారు. 137 మంది చిన్నారులకు సువర్ణ ప్రాశన సంస్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులు నల్లా నాగభూషణం గారు సువర్ణ ప్రాశన విషయాన్ని ప్రస్తావించారు. ఆవశ్యకతను పోషకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు, ప్రబంధకారిణి సభ్యులు పాల్గొన్నారు ★

## గో విజ్ఞాన్ పరీక్షల్లో బహుమతులు గెలుచుకున్న శ్రీ సరస్వతీ శిశు మందిరాల విద్యార్థులు

తెలంగాణ ప్రాంత గో సేవా విభాగం తరపున ప్రతి యేడాది లాగే ఈ యేడాది కూడా గో విజ్ఞాన్ పరీక్షలు తెలంగాణ ప్రాంతంలో జరిగాయి. ఇందులో శ్రీ సరస్వతీ శిశు మందిరాలకు చెందిన విద్యార్థులతో పాటు ఇతర పాఠశాలలకు చెందిన వారు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోసేవా విభాగం అందించే సాహిత్యాన్ని చదివి, పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.



గో విజ్ఞాన్ పరీక్షల బహుమతి ప్రదానోత్సవం భాగ్యనగరంలోని శ్రీ కేశవ మెమోరియల్ లోని సర్దార్ పటేల్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా బహుమతులు గెలుపొందిన సరస్వతీ శిశు మందిరాల విద్యార్థులు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆరెస్సెస్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ మాట్లాడుతూ భారతీయ గోసంపద చాలా విశిష్టమైనదనియు, భావితరాల వారు వాటిని కాపాడుకొని, సేంద్రియ వ్యవసాయ విధానంతో భారత భూమిని సస్యశ్యామలం చేయాలని చెప్తూ, పరీక్ష నిర్వహించిన నిర్వాహకులను వారు అభినందించారు.అలాగే ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, నేషనల్ హెల్త్ మిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ తెలంగాణ శాఖ మంజునాథ్, జాయింట్ డైరెక్టర్ పాఠశాల విద్యాశాఖ మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ★

---

## విపణి పర్వ పేరుతో వినూత్న మార్కెట్

పాఠశాల విద్యార్థులలో పర్యావరణం వంటి సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించేందుకు కొత్త ప్రయోగం జరిగింది. హైదరాబాద్ బండ్లగూడ జాగీర్ లోని శ్రీ విద్యారణ్య ఇంటర్ నేషనల్ స్కూల్ స్విస్ ప్రాంగణంలో చిన్నారులే మార్కెట్ ను నిర్వహించారు. పర్యావరణ హితాన్ని అభిలషిస్తూ పిల్లల చేత అనేక పర్యావరణ దాయక ఉత్పత్తులను తయారుచేయించారు. పిల్లలు గ్రూప్ లుగా ఏర్పడి, తాము తయారు చేసిన పర్యావరణ దాయక ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. విపణి పర్వ పేరుతో వినూత్నంగా పాఠశాల ప్రాంగణంలోనే మార్కెట్ ఏర్పాటు చేసి తల్లిదండ్రులు, చుట్టుపక్కల ప్రజలను ఆహ్వానించారు.

పర్యావరణ హితం కోరుతూ పిల్లలు చేసిన చొరవను అంతా మెచ్చుకొన్నారు. బండ్లగూడ జాగీర్ పరిధిలోని స్థానికులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ మార్కెట్ ను ప్రోత్సహించారు. క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ, కార్యదర్శి విశ్వేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణ మోహన్ విద్యార్థులను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల పర్యావరణం మీద, మార్కెట్ పోకడల పట్ల పిల్లల్లో అవగాహన కలుగుతుందని అభిలషించారు. ★


---



**నాదర్‌గుల్ :–** విద్యా భారతి విజ్ఞాన కేంద్ర పాఠశాల విద్యార్థిని జమల్పురి యశస్విని 8వ తరగతి పాఠశాలలో జరిగిన అండర్ 14 వయస్సు గల బాలికల షార్ట్ పుట్ విభాగంలో మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతిని గెలుపొందింది. తదుపరి యశస్విని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనుటకు ఎంపికయింది. ★

వార్తలు





## తెలంగాణలో పర్యటించిన విద్యా భారతి అఖిల భారతీయ కార్యదర్శి

విద్యా భారతి అఖిల భారతీయ కార్యదర్శి శివ ప్రసాద్ గారి పర్యటన తెలంగాణ ప్రాంతంలో రెండు రోజుల పాటు జరిగింది. మొదట జిల్లా కేంద్ర పాఠశాల పర్యటనలో భాగంగా భాగ్యనగర్ లోని సరస్వతీ నగర్ లోని పాఠశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థలు, శిశు వాటిక పరిశీలన, ప్రబంధకారిణి, ఆచార్యులతో సమావేశం నిర్వహించారు. అదే రోజు సాయంత్రం సరస్వతీ నగర్ పాఠశాల సంచాలితంగా ఆస్మాన్ గఢ్ లో నడుపుతున్న సంస్కార కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. అలాగే బస్తీ ప్రముఖులతో కూడా మాట్లాడారు. విద్యాపీఠం ద్వారా నడుపబడుతున్న సంస్కార కేంద్రాలు, అక్కడి బస్తీల్లో వాటి ప్రభావాన్ని వివరించారు.

తరువాత రోజు శ్రీ శారదా ధామంలోని శిక్షణా కేంద్రంలో జిల్లా కేంద్ర పాఠశాలల టోలీల బైఠక్ జరిగింది. ఇందులో 28 జిల్లా కేంద్రాల నుంచి బాధ్యులు హాజరయ్యారు. సుమారు 100 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారందరికీ విద్యాభారతి, విద్యాపీఠం ఆశిస్తున్న విషయాలు, చేస్తున్న విషయాలతో పాటు పాఠశాలల పటిష్ఠత మొదలైన విషయాల్లో వారందరికీ మార్గదర్శనం చేశారు.

చివరి రోజు ఉదయం ప్రాంత విషయ ప్రముఖులతో సమావేశం జరిగింది. ఇందులో 22 విషయ ప్రముఖులు పాల్గొని, తమ కార్య విస్తరణ, సంఘటన పని గురించి చర్చ జరిగింది. తర్వాత విభాగ్ సేవా ప్రముఖులు, సంయోజకుల బైఠక్ జరిగింది. 14 మంది ఇందులో పాల్గొన్నారు. పాఠశాలల ద్వారా నడిపే సంస్కార కేంద్రాలు, వాటి విస్తరణ, వాటి ఉద్దేశాల గురించి చర్చ చేశారు. చివరగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత టోలీ బైఠక్ జరిగింది. దీంతో వారి పర్యటన ముగిసింది. ★

---




**బేతంచర్ల :-** శ్రీ సరస్వతీ విద్యామందిర్, బేతంచర్ల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన శ్రీ పి జనార్దన్ రెడ్డి గారు నంద్యాల DEO మరియు అనంతపురం సమితి అధ్యక్షులు శ్రీ జి రామకృష్ణా రెడ్డి గారు. ★

---



అఖిల భారతీయ గణిత మేళా - 2025, ఆంధ్ర ప్రదేశ్, దక్షిణ మధ్య క్షేత్రం బాల వర్గ గణితము PPT లో ద్వితీయ స్థానంలో గెలుపొందిన శ్రీకృష్ణ విద్యామందిర్, విశాఖపట్టణం పాఠశాల చిన్నారులకు బహుమతులు అందిస్తున్న విద్యాభారతి అఖిల భారతీయ ప్రముఖులు. ★




## సమాజానికి ఉపయోగకారిగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయి శిశు మందిరాలు : లింగం సుధాకర రెడ్డి

మంచిర్యాల జిల్లా కల్యాణఖనికి సంబంధించిన శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు, పూర్వాచార్యుల సమ్మేళనం జరిగింది. దీనికి విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్రం సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర రెడ్డి, తెలంగాణ ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు, పూర్వ విద్యార్థి పరిషత్ దక్షిణ మధ్య క్షేత్ర సహ సంయోజక్ రాజారెడ్డి ప్రభుతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లింగం సుధాకర రెడ్డి గారు మాట్లాడుతూ భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు అని వాటిని పరిరక్షించేవి శ్రీ సరస్వతీ శిశు మందిరాలు అని తెలిపారు. విద్యార్థుల్లో దేశ భక్తి భావాన్ని పెంపొందించి వారిని సమాజంలో మంచి వ్యక్తులుగా, సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడంలో శిశు మంది రాల పాత్ర కీలకమన్నారు. వింత పోకడలు పోతున్న ప్రస్తుత సమాజంలో భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య అందాలంటే శిశు మందిర్ లాంటి విద్యాపీఠాలు అవసరం అని అన్నారు. దేశభక్తులు, దైవ భక్తులు, సమాజానికి ఉపయోగపడే వ్యక్తుల నిర్మాణం జరగాలని అన్నారు. సరస్వతీ శిశు మందిరాలు మరింత పటిష్ఠం కావడానికి ప్రతి ఒక్క పూర్వ విద్యార్థి పని చేయాలని పిలుపునిచ్చారు.

ఇక... ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు మాట్లాడుతూ.. శ్రీ సరస్వతీ శిశు మందిరాలు మరింత పటిష్ఠం కావడానికి, వాటి విస్తరణలో పూర్వ విద్యార్థుల పాత్ర, పూర్వ ఆచార్యుల పాత్ర బాగా వుంటుందని అన్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలను, భక్తి కథలు, ఆత్మీయత, మర్యాద, గౌరవం, మంచి అలవాట్లను పిల్లలకు నేర్పించడం ద్వారా మంచి వ్యక్తులుగా తయారవుతారని అన్నారు. వింత పోకడలు పోతున్న ప్రస్తుత సమాజంలో భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య అందాలంటే శిశుమందిర్ లాంటివి అవసరం అని నొక్కి చెప్పారు. మరో వైపు పూర్వ విద్యార్థులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ స్మృతులను గుర్తు చేసుకున్నారు. శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ అధ్యక్షులు శ్రీ విష్ణువర్ధన్ రావు, కార్యదర్శి శ్రీ గోవిందరావు, సహ కార్యదర్శి శ్రీ సూరం లక్ష్మీనారాయణ, పాఠశాల అధ్యక్షులు శ్రీ సూరిబాబు, విభాగ్ పూ. విద్యార్థిపరిషత్ అధ్యక్షులు శ్రీ గుండం అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు. ★

## శ్రద్ధాంజలి



**హుజూరాబాద్ :-** శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల హుజూరాబాద్ లో సహాయ ఆచార్యులుగా, శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల వేములవాడలో ప్రధానాచార్యులుగా ఉత్తమ సేవలను అందించిన శ్రీ బాగనారపు రమేశ్ (పూర్వాచార్యులు) 25 అక్టోబర్ 2025న పరమపదించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుకుంటూ హుజురాబాద్ శిశుమందిర్ శ్రద్ధాంజలి ఘటించింది. ★

**కింద పడ్డానని ఆగిపోకు, తిరిగి ప్రయత్నం చేస్తే విజయం నీదే... – అబ్దుల్ కలాం**



రాంపూర్ లోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం సహాయ ఆచార్యులు అనసూరి వేంకటేశ్వర్లు పదవీ విరమణ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రబంధకారిణి ఆయన్ను సన్మానించారు.

శ్రీ సరస్వతీ శిశు మందిర్ ముధోల్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన శ్రీమతి బంచోడే సరస్వతి గారికి సమితి కార్యదర్శి, పాఠశాల కార్యదర్శి గ్రాట్యుటీ చెక్ అందించారు.





శ్రీ సరస్వతీ శిశు మందిర్ సుభద్ర నిలయంలో పదవీ విరమణ పొందిన రామానంద్ తివారీ గారికి 2,50,000 గ్రాట్యూటీ చెక్‌ను అందించిన నిర్మల్ జిల్లా కార్యదర్శి గోపాల్ కిషన్, శైలేష్ మాశెట్టివార్, గంగాధర్ గౌడ్, మంతెన వేంకటేష్, తదితరులు.

RNI No. : 32283
SPHOORTHY (MONTHLY)
Volume : 50 Issue : 12
December - 2025

Postal Reg. No. : D/RNP/HCD-1204/2024-26
Published on 25th of Every Month
Posted on 29th & 30th Every Month
Posting at BPC-IV Partika Channel, Nampally, Hyderabad-01



శ్రీ శారదాధామము :- శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయము శ్రీ శారదాధామము నందు నిర్వహించిన "సప్తశక్తి సంగమం" కార్యక్రమములో మాట్లాడుతున్న నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, పార్లమెంట్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీమతి డాక్టర్ బైరెడ్డి శబరి గారు.




రామాయంపేట, అశోక్‌సింఘాల్ శిశుమందిర్

If undelivered please return to : **Sri Saraswathi Vidya Peetham**, 6-3-597/A/7, *Venkataramana Colony*, Khairatabad, Hyd-04.